




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఖమ్మం
భద్రాద్రి
కొత్తగూడెం

గురువారం 26, ఫిబ్రవరి 2026



2 లో..

### వెలుగుమట్ల భూదాన్ భూములపై చర్యలు
## పూర్తిగా చట్టబద్ధం

- రూ. 250 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి రక్షణ
- వెలుగుమట్ల భూదాన్
- భూములపై పత్రికా ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్

ఖమ్మం, సూర్య బ్యూరో వెలుగుమట్ల గ్రామ సర్వే నం. 147, 148, 149 లోని భూదాన్ భూములపై జిల్లా యంత్రాంగం చేపట్టిన కూల్చివేతలు, స్వాధీనం చర్యలు పూర్తిగా చట్టబద్ధమైన వని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### జాతీయ పంచాయతీ అవార్డుల పోటీలో
# సీతంపేట గ్రామం ఎంపిక
### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కొత్తగూడెం కలెక్టరేట్, సూర్య(మేజర్ న్యూస్) : జాతీయ పంచాయతీ అవార్డులు 2023ఉ24లో భాగంగా పచ్చదనంఉపరిశుభ్రత విభాగంలో సుజాతనగర్ మండలం సీతంపేట గ్రామం ఎంపిక కావడం జిల్లా అభినందనీయం అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు . గ్రామంలోని పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాల్లో సాధించిన పురోగతికి గుర్తింపుగా ఈ ఎంపిక జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా బుధవారం కలెక్టర్ సీతంపేట గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య చర్యలను సమగ్రంగా పరిశీలించారు.



2 లో..

### తొలి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం
అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్.



### మీ భద్రతే మా లక్ష్యం : పోలీస్ కమిషనర్




7 లో..

### వెలుగుమట్ల బాధితులకు
## బాసటగా కేటీఆర్

- వెలుగుమట్ల బాధితులకు బాసటగా కేటీఆర్..
- నేడు ఖమ్మం పర్యటన
- ఖమ్మం వెలుగుమట్లలో ప్రభుత్వ విధ్వంసం..
- బాధితులను పరామర్శించనున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- వెలుగుమట్ల బాధితులకు బాసటగా నిలవనున్న గులాబీ దళపతి
- పేదల జీవించే హక్కును కాలరాస్తున్న రేవంత్ సర్కార్
- కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యంలో 'దమనకాండ'..
- పేదల ఇళ్లపై బుల్డోజర్ల దాడి దుర్మార్గం..
- ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్
- పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్



7 లో..



### అరైవ్ - అలైవ్ లో ప్రజలను
## భాగస్వామ్యం చేయండి

- నేరస్తులకు శిక్ష పడేలా పని చేయండి
- నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




2 లో..

కొత్తగూడెం క్రైమ్,సూర్య(మేజర్ న్యూస్)- రోడ్డు ప్రమాదాల నివారణ కోసం చేపట్టిన అరైవ్ - అలైవ్ కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేసి విస్తృతంగా ప్రచారం, అవగాహనా కల్పించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీస్ సూచించారు. హేమచంద్రాపురం పోలీసు హెడ్ క్వార్టర్స్ లో బుధవారం జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు.

# జాతీయ పంచాయతీ అవార్డుల పోటీలో సీతంపేట గ్రామం ఎంపిక



గ్రామంలో డ్రైనేజీలు, ఇంకుడు గుంతలు, ఇంటింటి మరుగుదొడ్లు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయ సదుపాయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిలో నిర్మించిన మరుగుదొడ్లను తప్పనిసరిగా వినియోగించుకోవాలని, బహిరంగ విసర్జనకు చేయరాదు అని గ్రామస్థులకు సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించి గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని, చెత్త వర్గీకరణను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డ్రైనేజీలు ఎక్కడా మూసుకుపోకుండా తరచుగా శుభ్రపరచాలని, ఇంకుడు గుంతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో పురుషులు, మహిళలకు వేర్వేరు మరుగుదొడ్లు ఏర్పాటు చేసి పరిశుభ్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో పచ్చదనం విస్తరించేందుకు విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని కలెక్టర్ ఆదేశించారు. నర్సరీల ద్వారా నాణ్యమైన మొక్కలు పెంచి ప్రతి వీధిలో, ఖాళీ ప్రదేశాలలో, పాఠశాలలు మరియు అంగన్వాడీ కేంద్రాల పరిసరాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో సీతంపేట గ్రామం ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. గ్రామ లైబ్రరీలో 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన అధ్యయన సామగ్రిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీల వెంట ఉన్న గుంటలను సరిచేయడానికి అవసరమైన రోలర్‌ను అందజేస్తామని హామీ ఇచ్చారు. బయోచార్ తయారీ చేసి వచ్చిన బొగ్గుని డ్రైనేజీలలో చల్లడం ద్వారా డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉంటాయి అని ఆ విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

త్వరలో జాతీయ స్థాయి పరిశీలన బృందం గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో, పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పరిరక్షణ, మౌలిక సదుపాయాల సంరక్షణలో ఎటువంటి లోపాలు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ కృష్ణ ప్రసాద్, శిక్షణ డి పి ఓ అనూష, ఎంపీడీవో అనురాధ, ఎంపీఓ శ్రీనివాస్, డిఎల్పిఓ ప్రభాకర్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అరైవ్ - అలైవ్ లో ప్రజలను భాగస్వామ్యం చేయండి

కేసుల విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించి తమ తమ నివాస ప్రాంతాల్లో, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా కృషి చేయాలని తెలిపారు. ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి బాధితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయిన బాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన

అరైవ్ – అలైవ్ రెండో విడతలో భాగంగా ప్రజలకు రోడ్డు భద్రతా నియమాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి (బ్లాక్ స్పాట్స్) వాటి నివారణ కోసం సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు, డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, జిల్లాలోని సిఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను విమర్శించే స్థాయి మీకు లేదు..

**తుమ్మల అనుచరుడు కొయ్యల అచ్యుతరావు..**



దమ్మపేట సూర్య (మేజర్ న్యూస్ )తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై కొంతమంది సోషల్ మీడియా తొత్తులు అనవసరమైన ఆరోపణలకు పాల్పడుతున్నారని ఇటువంటి ఆరోపణలు చేస్తూ ఎవరి మెప్పో కోసమో దిగజారి పోవద్దని ఏ ఏం సి మాజీ వైస్ చైర్మన్, మంత్రి తుమ్మల అనుచరుడు కొయ్యల అచ్యుతరావు హితువు పలికారు ఉమ్మడి ఖమ్మం జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేసిన అభివృద్ధి ప్రదాతపై ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు పల్లె గ్రామాలలో సైతం అభివృద్ధి పేరిట ఊపిరినింపిన ప్రజా బాంధవుడు మంత్రి తుమ్మలపై ఆరోపణలు మానుకోకపోతే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన అన్నారు పామాయిల్ రైతులను రాజును చేసిన మహా నాయకుడు తుమ్మల అని అటువంటి తుమ్మల నాగేశ్వరావు పై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే రైతులు కన్నెర్ర చేస్తారని ఇకనైనా బ్లాక్ మెయిల్ రాజకీయాలు మానుకొని మంత్రి తుమ్మల నాగేశ్వరావు చేస్తున్న అభివృద్ధిని కళ్ళు తెరిచి చూడాలని హితువు పలికారు..

## అంగన్వాడి భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



అశ్వరావుపేట టౌన్, సూర్య (మేజర్ న్యూస్) –అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అశ్వరావుపేట మండల వ్యాప్తంగా పర్యటించి పలు శంకుస్థాపన కార్యక్రమాలు పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ క్రమంలో అశ్వరావుపేట మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు తూర్పు బజారులో నూతన అంగన్వాడి భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తో పాటుగా నాలుగో వార్డ్ కౌన్సిలర్ కట్టా సింధుజ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ రాబోయే మూడేళ్లలో అశ్వారావుపేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా అదేవిధంగా గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు అన్ని రంగాలలో అశ్వారావుపేట నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తుమ్మ రాంబాబు, ఆత్మకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, జూపల్లి ప్రమోద్,పంచాయతీరాజ్ డిఇ శ్రీధర్, ఏఈ అక్షిత,ఆర్డబ్ల్యూఎస్ డిఈ సాల్మన్, ఏఈ సతీష్, అంగన్వాడీ అధికారులు సర్పంచులు ఉపసర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెలుగుమట్ల భూదాన్ భూములపై చర్యలు పూర్తిగా చట్టబద్ధం.. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

31 ఎకరాల 7 గుంటల భూదాన్ భూమి ఆక్రమణలో ఉండగా, సంబంధిత భూమి మొత్తం విలువ సుమారు 250 కోట్లకు పైగా ఉంటుందని, భూదాన్ బోర్డు భూమిని సిసిఎల్ఏ, హై కోర్ట్ ఆదేశాల మేరకు ప్రభుత్వం స్వాధీనంలోకి తీసుకోవడం ద్వారా భారీ స్థాయిలో ఆస్తిని రక్షించగలిగామని కలెక్టర్ తెలిపారు. ఫిబ్రవరి 24 నాడు నిర్వహించిన కూల్చివేతలపై తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు దానిని తిరస్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. భూదాన్ యజ్ఞ బోర్డు, రెవెన్యూ శాఖ సమగ్ర విచారణలో నకిలీ పత్రాలు, అక్రమ కేటాయింపులు వెలుగు చూశాయని, ఇప్పటికే పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. హైకోర్టు స్టే ఉన్న నిర్మాణాలను మినహాయించి మిగిలిన భూమిని ప్రభుత్వం స్వాధీనం లోకి తీసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూమిని భవిష్యత్ ప్రజా అవసరాలకు ఉపయోగిస్తామని, ఇండ్లు కోల్పోయిన వారిలో అర్హులైన స్థానిక పేదలకు ప్రభుత్వం తగు విధంగా న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## తొలి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

**కొత్తగూడెం కలెక్టరేట్, సూర్య(మేజర్ న్యూస్) :**

జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల తొలి రోజు ప్రశాంతంగా జరిగినట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా పాల్వంచ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాల, పాల్వంచ లోని పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించి, పరీక్షల నిర్వహణ తీరును సమగ్రంగా పరిశీలించారు. ప్రశ్నాపత్రాల భద్రతా పంపిణీ విధానం, అభ్యర్థుల తనిఖీ ప్రక్రియ, ఇన్విజిలేషన్ వ్యవస్థ, భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ తదితర అంశాలను సమీక్షించి, పరీక్షలు పారదర్శకంగా నిర్వహించబడుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 37 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించబడినట్లు తెలిపారు. జనరల్, వొకేషనల్ విభాగాలు కలిపి మొత్తం 9,685 విద్యార్థులు ఉండగా , అందులో 9,210 మంది పరీక్షలకు హాజరయ్యారని వెల్లడించారు. జనరల్ విభాగంలో 7,973 మందికి విద్యార్థులు ఉండగా , 7,683 మంది హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 1,712 మంది ఉండగా, 1,527 మంది హాజరయ్యారు. మొత్తం 475 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షల సందర్భంగా ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్షా కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, భద్రతా చర్యలు తదితర అన్ని మౌలిక వసతులు సమృద్ధిగా కల్పించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు .తదుపరి రోజుల్లో నిర్వహించనున్న పరీక్షలు కూడా ఇదే విధంగా పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరై ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ పరిశీలనలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక సేవలో ఎమ్మెల్యే పాయం

**–ఘనంగా వేంకటేశుని వార్షిక బ్రహ్మోత్సవాలు**

మణుగూరు ఆర్ సి,సూర్య(మేజర్ న్యూస్) – మణుగూరు పీవీ కాలనీలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 11వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు మరియు ప్రాంత అభివృద్ధి కోసం పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తి వాతావరణంతో కళకళలాడాయి. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. సంప్రదాయాలను పరిరక్షిస్తూ పండుగలను ఘనంగా నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఎమ్మెల్యే స్వయంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సింగరేణి ఏరియా వైద్యులు డాక్టర్ పైళ్ళ శేషగిరిరావు, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, గట్టయ్య, సమితి సింగారం ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, విప్పల సింగారం ఉపసర్పంచ్ గోరంట్ల కనకయ్య, కూనవరం ఉప సర్పంచ్ కోటం మనోజ్, కూనవరం వార్డు సభ్యులు బర్ల శ్వేతన్, సుబ్బారెడ్డి, ఎస్ గణేష్ రెడ్డి, జీవి, జీవరత్నం, సింగరేణి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పాల్గొన్నారు.



# క్రీడలను ప్రోత్సహించే జర్నలిస్టులు అభినందనీయులు

## జర్నలిస్ట్ కప్ క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాయం





మణుగూరు ఆర్ సి/పినపాక ,సూర్య(మేజర్ న్యూస్) – పినపాక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఎల్చిరెడ్డిపల్లి క్రికెట్ గ్రౌండ్ లో నిర్వహిస్తున్న జర్నలిస్ట్ కప్ -26 క్రికెట్ టోర్నమెంట్ పినపాకలో బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌ను పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిధి గా హాజరై ప్రారంభించారు. అనంతరం క్రీడా మైదానంలో మొక్కను నాటారు. టోర్నమెంట్ లో పాల్గొన్న జట్లకు శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టులతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనడం అభినందనీయమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఇలాంటి క్రీడా పోటీల ద్వారా జర్నలిస్టులు,ప్రభుత్వ యంత్రాంగం మధ్య సత్సంబంధాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు. పినపాక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జర్నలిస్ట్ కప్ క్రికెట్ టోర్నమెంట్ లో జర్నలిస్టు జట్లతో పాటు రెవెన్యూ, పోలీస్, విద్య, వైద్య, పంచాయతీ రాజ్, విద్యుత్, ఇతర ప్రభుత్వ శాఖల జట్లు పాల్గొంటున్నాయి.ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టులు, ప్రభుత్వ అధికారులు రెండు కీలక స్థంభాలుగా పనిచేస్తున్నారని అన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు పరస్పర అవగాహన, ఐక్యత, స్నేహాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంబించి కాసేపు బ్యాటింగ్ చేసి అందరినీ అలరించారు. అనంతరం వివిధ శాఖల జట్లను పరిచయం చేసుకుని మొదటి మ్యాచ్ ని ప్రారంభించి క్రీడాకారులను అభినందించారు. మండలంలో ఉన్న ఈ క్రీడా మైదానాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామి ఇచ్చారు. ఈకార్యక్రమంలో పినపాక ఎంపిడీవో వెంకటేశ్వర రావు, ఎస్ఐ సురేష్, గిర్ధావర్ శరత్, ఎంఈఓ నాగయ్య, సర్పంచులు సోడే విజయలక్ష్మి, తోలెం స్వప్న, మద్దెల సమ్మయ్య, వాగబోయిన చందర్రావు,పూణెం వెంకటేశ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కీసర సుధాకర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు బూరాశంకర్,బిల్లా నాగేందర్, సనప భరత్, ముక్కు మహేష్ రెడ్డి, కట్టా శ్రీనివాసరావు, బొల్లె నరేష్, కొంపెల్లి సంతోష్, ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.జర్నలిస్ట్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ద్వారా జర్నలిస్టులు మరియు ప్రభుత్వ శాఖల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# కుమ్మెర జాతర ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**-చిన్నారి హత్య కేసులో డి.ఎస్.పి పాత్రపై విచారణ జరపాలి..**
**-సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్..**
**-నాగ కర్నూల్ ఘటనపై సిపిఎం నిరసన..**



భద్రాచలం ఆర్ సి సూర్య మేజర్ (న్యూస్ న్యూస్ కుల దురహంకారంతో రెండు నెలల చిన్నారి నీ అత్యంత పాశవీకంగా హత్య చేసిన అగ్రవర్ణ పెద్దలను వెంటనే అరెస్టు చేసి ఎస్ టి ఎస్ సి ఎట్రాసిట్ తోపాటు హత్య కేసులు నమోదు చేసి అత్యంత కఠినంగా శిక్షించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ డిమాండ్ చేశారు. నాగర్ కర్నూలు జిల్లా కొమ్మెర జాతరలో జరిగిన ఘటనపై దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో ప్లే కార్డులతో నిరసనను తెలియజేశారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఏజే రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత జిల్లాకు అతి సమీపంలోనే కుల దూరాంకార హత్య జరిగిన ఇప్పటివరకు ముఖ్యమంత్రి గాని రాష్ట్ర డిజిపి గాని స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. దళిత మహిళ దేవుని దర్శనానికి వస్తే విచక్షణారహితంగా దాడి చేయడమే కాకుండా రెండు నెలల చిన్నారిని అత్యంత పాశువికంగా హత్య చేసిన అగ్రవర్ణాల పెద్దలకు ముఖ్యమంత్రి వత్తాసు పలకటం ఏమిటి అని ప్రశ్నించారు. ఈ ఘటనపై ప్రేక్ష పాత్ర వహిస్తున్న నాగర్ కర్నూల్ డిఎస్పీని సైతం విచారణ చేపట్టాలని అతని పేరు కూడా నిందితుల జాబితాలో చేర్చాలని ఏజె రమేష్ డిమాండ్ చేశారు. చిన్నారి హత్యకు కారణము కావటంతో పాటు చిన్నారి తండ్రిని సైతం గదిలో బంధించి అత్యంత కిరాతకంగా దాడి చేశారని దానిపై కూడా విచారణ చేపట్టాలని కోరారు. దేశవ్యాప్తంగా కుమ్మెర జాతర ఘటన చర్చి జరుగుతుంటే హోం శాఖ చేతిలో పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం అగ్రకులాలకు దాసోహం అవ్వటమేనని అన్నారు. వెంటనే నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట రామారావు పారేల్లి సంతోష్ కుమార్ డి సీతాలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి నకిరేకంటి నాగరాజు కొలగాని రమేష్ కొరడా శ్రీనివాస్ దొనకొండ రాఘవయ్య జీవనజ్యోతి ఎస్ అజయ్ కుమార్ సంద్ర భూపేంద్ర రత్నం శాఖ కార్యదర్శులు గోవర్ధన ఝాన్సీ ఎర్రంశెట్టి పూర్ణిమ రామకృష్ణ పోసి కొరసా రవి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు

# చిన్న చినుకుపడితే.... బురదే



**-కొత్తతండా (పీ) గ్రామస్తుల ఇబ్బందులు..**
**-సులానగర్ రోడ్డుపైనే చెత్త తగులపెట్టిన పంచాయతీ సిబ్బంది...**

టేకులపల్లి సూర్య (మేజర్ న్యూస్):మండలంలోని కొత్తతండా (పీ) వెళ్లే రోడ్డు వర్షం నీరు ఆగి అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షానికే రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రజలు నానా అవస్థలు పడుతు న్నారు. ఈ రోడ్డులో పలు పడటంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే గుంతలా నీరు ద్విచక్ర వాహనంపై వెళ్లేవారిపై బురద నీరంతా పడుతుందని కొత్త తండా (పీ) ప్రజలు వాపోతున్నారు. నీరు నిల్వ ఉండకుండా.. వాహనదారులకు పంచాయతీ ప్రజలకు ఇబ్బంది కలగకుండా రహదారిని అధికారులు మరమ్మ తులు చేపట్టాలని, గ్రామపంచాయతీలో చెత్తాచెదారం పేరుకుపోయిందని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు. సులానగర్ పంచాయతీలో పేరుకు పోయిన చెత్తను డంపింగ్ యార్డ్ లో వేయకుండా రోడ్డు పక్కనే కలపెట్టడంతో కరెంటు వైర్ లకు ప్రమాదం జరిగిన పరిస్థితి ఉందని, గ్రామస్తులు తెలుపుతున్నారు. సులానగర్ సెక్రటరీ, మల్టీ పర్పస్ వర్కర్స్ పంచాయతీ పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారని వాపోతున్నారు. అధికారులు పట్టించుకోని పంచాయతీల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



# స్నేహబంధాలకు వేదికగా జర్నలిస్ట్ కప్ క్రికెట్ టోర్నమెంట్

**-మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు.**



మణుగూరు ఆర్ సి/పినపాక, సూర్య(మేజర్ న్యూస్)–పినపాక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జర్నలిస్టులకు క్రికెట్ టోర్నమెంట్ అధికారులు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టుల స్నేహ బంధాలకు వారదిగా నిలుస్తుందని పినపాక మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు అన్నారు. బుధవారం పినపాక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఎల్చిరెడ్డిపల్లి క్రికెట్ గ్రౌండ్లో నిర్వహిస్తున్నటువంటి జర్నలిస్ట్ కప్ క్రికెట్ టోర్నమెంట్ కి గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రికెట్ గ్రౌండ్ లో మొక్కలు నాటారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని మ్యాచ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం వలన స్నేహ భావాన్ని పెంపొందించడంతోపాటు సమాజంలో సానుకూల వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. నిత్యం విధినిర్వహణలో ఎంతో ఒత్తిడిలో ఉండే ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఇలాంటి క్రీడా పోటీల్లో పాల్గొనడం వలన మానసికంగా ఉత్సాహంగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వహిస్తున్న జర్నలిస్టులను అభినందించారు. టోర్నమెంట్ నిర్వహనకు అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సోడె విజయలక్ష్మి, నూపా బాపునమ్మ, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి, పొలిశెట్టి సత్తిబాబు, మాజీ ఎంపీపీ గుమ్మడి గాంధీ, ముక్కు నాసర్ రెడ్డి, కొండేరు రాము, కొండేరు భూషణం, ముక్కు వెంకటేష్ రెడ్డి, కంది సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాళీమాత ఆలయ పునఃప్రతిష్ఠకు స్పందించిన కేంద్ర మంత్రి

**-స్థలం,పరిహారం కేటాయించాలని ఆదేశం**

**-భక్తుల మనోభావాలను గౌరవిస్తూ నిర్ణయం తీసుకోవాలని లేఖ**

మణుగూరు ఆర్ సి, సూర్య(మేజర్ న్యూస్)–మణుగూరు మండలంలోని చారిత్రాత్మక శ్రీ కాళీమాత ఆలయ తరలింపు మరియు పునఃప్రతిష్ఠా పనులపై కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బి.టి.పి.ఎస్.రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా 55 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం తొలగింపుకు గురవుతున్న నేపథ్యంలో, ఆలయ కమిటీ విన్నపాన్ని పరిశీలించిన మంత్రి తక్షణమే చర్యలు చేపట్టారన్నారు.ఈ మేరకు మంత్రి కార్యాలయం నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్‌కు అధికారికంగా లేఖ పంపడం జరిగిందన్నారు.రైల్వే లైన్ నిర్మాణం కారణంగా ఆలయాన్ని ప్రస్తుత ప్రాంతం నుండి తరలించాల్సి ఉన్నందున, శాస్త్రోక్తంగా పునఃప్రతిష్ఠించడానికి తగిన ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలని మంత్రి కోరారు.ఆలయ నిర్మాణానికి మరియు తరలింపుకు అవసరమైన నష్టపరిహారాన్ని కూడా నిబంధనల ప్రకారం అందించాలని సూచించారని తెలిపారు.గత 55 ఏళ్లుగా ఈ ప్రాంత భక్తుల ఆరాధ్య దైవంగా ఉన్న కాళీమాత ఆలయానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను మరియు భక్తుల సెంటిమెంట్లను దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రి కలెక్టర్‌కు పంపిన లేఖలో పేర్కొన్నారు. ఆలయ ట్రస్టీ ఉప్పల సత్యనారాయణ శాస్త్రి కుమారుడు ఉప్పల శ్రీకర్ మరియు హిందూ బంధువు గడ్డం రాము అందించిన విన్నపం మేరకు మంత్రి స్పందిస్తూ, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారన్నారు. ఈ నిర్ణయం పట్ల ఆలయ కమిటీ సభ్యులు మరియు మణుగూరు భక్తులు హర్షం వ్యక్తం చేసారు.





# శిథిలావస్థలో ఉన్న పశువుల ఆసుపత్రిని పరిశీలించిన డాక్టర్ సాయి సందీప్

## ఆసుపత్రి పరిస్థితిని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కు వివరించిన దుద్దుకూరి సుమంత్





జూలూరుపాడు,సూర్య(మేజర్ న్యూస్)– మండలంలోని గుండెపుడి గ్రామంలో శిదిలావస్థలో ఉన్న పశువుల ఆసుపత్రి ని బుధవారం పశువుల డాక్టర్ సాయి సందీప్,కాంగ్రెస్ పార్టీ నాయకులు దుద్దుకూరి సుమంత్ పరిశీలించారు.పశువుల ఆసుపత్రి పూర్తిగా శిధిలావస్థకు చేరిందని,ఏ సమయంలో కూలిపోయే అవకాశం ఉందని ఉన్నత అధికారులకు డాక్టర్ సాయి సందీప్ తెలిపారు.దుద్దుకూరి సుమంత్ ఫోన్ ద్వారా శిథిలావస్థలో ఉన్న గుండెపుడి పశువుల ఆసుపత్రి పరిస్థితిని వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్ కు వివరించారు.వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి నూతన పశువుల ఆసుపత్రి భవనానికి సంబందించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.త్వరలోనే పశువుల ఆసుపత్రిని నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కు సుమంత్,గ్రామ రైతులు ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి,సొసైటీ మాజీ సభ్యులు కళ్యాణపు నరేష్,వార్డు సభ్యులు తూము కోటయ్య,భూక్యా నర్సింహారావు, పొనుగుపాటి సుధీర్,పునాటి నర్సింహారావు,డంగు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



టేకులపల్లి, సూర్య (మేజర్ న్యూస్మం): మండలాపరిదిలొని గంగారం సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు చనిపోయిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లో కెళ్తే.. టేకులపల్లి మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన కోర్స రాంబాబు (30) లచ్చగూడెం నుంచి బైకుపై ఆళ్లపల్లి వెళుతుండగా... గంగారం సమీపంలో ఎదురుగా వస్తున్న ఐస్ క్రీమ్ బండి ఢీకొనడంతో తీవ్ర బుధవారం గాయాలయ్యాయి. కోర్స రాంబాబు కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బోడు పోలీసులు సంఘటనానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య కళ్యాణి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## సులానగర్ పంచాయతీలో మధ్యాహ్నా భోజనాన్ని పరిశీలించిన సర్పంచ్



టేకులపల్లి సూర్య (మేజర్ న్యూస్)– మండలం లోని సులానగర్ గ్రామపంచాయతీలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సులానగర్ సర్పంచ్ గుగులోత్ లక్ష్మణానాయక్, ఉపసర్పంచ్ ఉండేటి చెన్నయ్య బుధవారం మధ్యాహ్నా భోజనాన్ని పరిశీలించారు. సులానగర్ పాఠశాలలో మధ్యాహ్నా భోజనం చేసి మెనూ ప్రకారం భోజనాన్ని పెడుతున్నారా లేదా చూశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, నాణ్యమైన భోజనం పెట్టాలని పాఠశాలలో మధ్యాహ్నా భోజన నిర్వహకులకు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచనలు చేశారు.



## ఓవర్ మెన్ ను దుర్భాషలాడిన కే ఓ సి పి ఓ

– పీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన కార్మికులు



టేకులపల్లి సూర్య (మేజర్ న్యూస్)– కోయగూడెం ప్రాజెక్టు అధికారి వ్యవహార శైలి రోజురోజుకు వివాదాస్పదంగా మారుతుంది. ఒక వైపు గనిలో బొగ్గు ఉత్పత్తి, రవాణాపై దృష్టి సారించకపోగా మరోవైపు నిర్వాసితుల పట్ల చులకనగా వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తుంది. కోయగూడెం ఓసి లో వే బ్రిడ్జ్ లో తలచిన సాంకేతిక సమస్యను సకాలంలో గుర్తించని నిర్లక్ష్యం కారణంగా సింగరేణి వేలాది టన్నుల బొగ్గును నష్టపోయింది. ఇటీవల కోయగూడెం ఓసి నిర్వాసిత టార్పాలిన్ కార్మికుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేయడంతో విషయం ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టి వరకు వెళ్లింది. ఇది ఇలా ఉండగా తాజా గా మూడు రోజుల క్రితం విధుల్లో ఉన్న ఓ ఓర్మెన్ పట్ల అసభ్యకరంగా దూషించడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం కేఓసీ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట కార్మికులు సుమారు గంటకు పైగా ఆందోళన నిర్వహించారు. ప్రాజెక్టు అధికారి క్షమాపణ చెప్పాలంటూ ఆందోళన దిగారు. ఆ రోజు ప్రాజెక్ట్ అధికారి లేకపోవడంతో తిరిగి బుధవారం కార్మిక సంఘాల నాయకులు ఓర్మెన్ దూషించిన విషయమై చర్చలు జరిపినట్లు తెలిసింది. బొగ్గు ఉత్పత్తి, రవాణాలో విఫలం కావడంతో పాటుగా వే బ్రిడ్జిలు తలెత్తిన సాంకేతిక తప్పిదాన్ని సకాలంలో గుర్తించడం లో నిర్లక్ష్యం వహించడంతో పాటుగా విధుల్లో ఉన్న కార్మికుల పట్ల , నిర్వాసిత ఆదివాసీల పట్ల కే ఓ సి పి ఓ అనుసరిస్తున్న వైఖరిపై సర్వాత్ర విమర్శలు వెలుగుతున్నాయి . సింగరేణి సిఎండి కోయగూడెం ప్రాజెక్టు అధికారి పై చర్యలు తీసుకోవాలని కార్మికులు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



## డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన ఒకరికి జైలు శిక్ష

**–మరో ముగ్గురికి రూ 1000 చొప్పున జరిమానా**

అశ్వరావుపేట టౌన్ సూర్య (మేజర్ న్యూస్ )–అశ్వరావుపేట పరిధిలోని ఇటీవల చేసిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో నలుగురు పట్టు పడ్డారు. పట్టుబడ్డ వారిలో కుక్కునూరు మండలం నెమలిపేట గ్రామానికి చెందిన కాంతి పల్లి కాంతారావు కు రెండు రోజులు జైలు శిక్ష విధించగా మరో ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికి వెయ్యి చొప్పున జరిమానా దమ్మపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి భవాని రాణి విధించారు. ఈ సందర్భంగా ఎస్హెచ్ఓ యయాతి రాజు మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నామని మద్యం సేవించి వాహనం నడిపితే ఉపేక్షించేది లేదని తెలియజేశారు.

## ఘనంగా శ్రీ సువర్చలసహితా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



**ఇల్లందు, సూర్య ఆర్సి (మేజర్ న్యూస్)–**

ఇల్లందు ఏరియా లోని శ్రీ సువర్చలసహితా అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇల్లందు ఏరియా జీఎం వి. కృష్ణయ్య దంపతులు, విసోటోజియం డి. రామస్వామి దంపతులు, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అంజిరెడ్డి దంపతులు, కమిటీ సభ్యుల దంపతులు పాల్గొన్నారు.ముందుగా ఉదయం హోమ కార్యక్రమంలో ముఖ్య అతిథులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్ట, శివలింగ ప్రతిష్ట, లక్ష్మీదేవి, గణపతి ప్రతిష్ట, నాగపంచమి ప్రతిష్ట, ప్రతిష్టలతో పాటు ఇతర విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా జరిపారు. తరువాత శివకళ్యాణ మహోత్సవంలో దంపతులు పాల్గొని కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనతరం కమిటి వాళ్ళు ఏర్పాటు చేసిన అన్నదాన మహా ప్రసాదంలో భక్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి దర్శనంతో పాటు ఆశీర్వాదాలు పొందారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.ఈ కార్యక్రమంలో ఇతర మైన్స్ అండ్ డిపార్టుమెంటు అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, ఇల్లందు ప్రజలు పాల్గొన్నారు.



# ప్రమాదాల నియంత్రణకు రోడ్డు సేఫ్టీ అందరి బాధ్యత...

**- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
**-రోడ్డు భద్రతా పనులు వేగవంతంగా పూర్తి చేయాలి**
**-ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి**
**-ప్రధాన జంక్షన్ ల వద్ద రోడ్లపై గో స్లో వైట్ పేయింట్, భద్రతా సూచికలు ఏర్పాటు**
**-రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన రోడ్డు భద్రతా పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం రూరల్ సూర్య మేజర్ న్యూస్ :**
జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చేపట్టిన పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి, స్పష్టమైన మార్పు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు.బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డాటాబేస్ ఆధారంగా జిల్లాలో గుర్తించిన ముఖ్యమైన 30 ప్రమాద ప్రాంతాలలో చేపట్టిన రోడ్డు భద్రతా పనులలో భాగంగా ఏదులాపురం మున్సిపాలిటీ లోని వెంకటగిరి క్రాస్ రోడ్, కోదాడ క్రాస్ రోడ్, వరంగల్ క్రాస్ రోడ్డు, ఏదులాపురం జంక్షన్ ప్రాంతాలలో మున్సిపల్ చైర్మన్ పోకబత్తిని అనిత తో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి రోడ్డు భద్రతా పనులను పరిశీలించారు.అనంతరం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డు, కొత్త బస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, బల్లేపల్లి సెంటర్, రఘునాథపాలెం ఆపిల్ సర్కిల్ ప్రాంతాలలో మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి రోడ్డు భద్రతా పురోగతి పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూరోడ్డు భద్రత



కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే అవకాశమున్న 30 బ్లాక్ స్పాట్స్‌ను శాస్త్రీయంగా గుర్తించి, అక్కడ స్పీడ్ కంట్రోల్ చర్యలు చేపట్టామని తెలిపారు. రంబుల్ స్ట్రిప్స్, సైన్ బోర్డులు, జీబ్రా క్రాసింగ్‌లు, పాదచారుల మార్గాలు, రోడ్ స్టడ్స్, క్యాట్ ఐస్, సోలార్ బ్లింకర్స్, క్రాష్ బారియర్స్, థర్మోప్లాస్టిక్ లైన్ మార్కింగ్ వంటి భద్రతా చర్యలను సమగ్రంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.ప్రధాన జంక్షన్ల వద్ద రోడ్డుపై "గో స్లో" వైట్ పేయింట్ వేయడం, స్కూల్ జోన్‌ల వద్ద ప్రత్యేక హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, స్పీడ్ బ్రేకర్లు సరిగ్గా నిర్మించడం వంటి చర్యలు ప్రజల్లో అప్రమత్తత పెంచుతాయని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్ డిటెక్షన్ సెంటర్ (ఐఆర్ఏడి) డేటాను సమీక్షించి, ప్రమాదాల ప్రధాన కారణాలను విశ్లేషించి చర్యలు తీసుకోవాలని అన్నారు. రాబోయే 15 రోజుల్లోనే మార్పు కనిపించేలా అధికారులు పనిచేయాలన్నారు. పనులు పూర్తి చేయడమే కాదు, నాణ్యతను కూడా నిర్ధారించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.నగర పరిధిలో నూతన రహదారుల నిర్మాణంలో డ్రైనేజీ వ్యవస్థను తప్పనిసరిగా కల్పించాలని, అవసరమైన ప్రాంతాలలో పుట్ పాత్ ల నిర్మాణం చేపట్టాలని, వర్షాకాలంలో రోడ్లు దెబ్బతినకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, నూతన పాలకవర్గం, అధికారులు సమన్వయంతో





పనిచేస్తే మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చని కలెక్టర్ తెలిపారు.రోడ్డు ప్రమాదం జరిగాక స్పందించడం కంటే, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమైనది అన్నారు. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ నియమాలను పట్టించుకోకపోవడం, యువత స్పీడ్‌పై నియంత్రణ ఉండకపోవడం వలన డ్రైవింగ్ సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. రోడ్డు భద్రత ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల సహకారం తో ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రంలో మున్సిపల్ చైర్మన్ అనిత, ఆర్ అండ్ బి ఎస్.ఈ. యాకోబ్, పబ్లిక్ హెల్త్ ఇ ఇ రంజిత్, నేషనల్ హైవే పిడి దివ్య, ఈఈ యుగంధర్, ఎదులాపురం మున్సిపల్ కమీషనర్ మున్వర్ అలీ, ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ అనిల్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు

**- మండలంలో రెండు కేంద్రాలలో పరీక్షలు నిర్వహణ.**

**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్.....**
ఇంటర్మీడియట్ సంవత్సర పరీక్షలు ప్రారంభమైయ్యాయి. పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేసి బుధవారం మొదటి సంవత్సరం మొదటి పరీక్ష కు విద్యార్థులు హాజరయ్యారు. పెనుబల్లి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, టేకులపల్లి మోడల్ స్కూల్లో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు ఏర్పాటు చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంపరీక్షలలో జూనియర్ కళాశాలలో 156 మంది విద్యార్థులకు 150 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. టేకులపల్లి మోడల్ స్కూల్ కేంద్రంలో 180 మంది విద్యార్థులకు 175 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఐదు మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. ఐదు నిమిషాల ఆలస్యం ఆలస్యమైతే పరీక్షలకు నిరాకరణ సడలించడంతో దూరప్రాంతాల విద్యార్థిని



విద్యార్థులకు ఊరటను కలిగించింది. ఈ రెండు కేంద్రాలలో ఏ ఒక్క విద్యార్థి పరీక్షలకు ఆలస్యం కాకుండా నిర్ణీత సమయానికి చేరుకొని పరీక్షలు రాశారు. మండలంలో ఏర్పాటుచేసిన రెండు కేంద్రాలలో మొదటిరోజు మొదటి సంవత్సరం పరీక్షలకు ప్రశాంతంగా విద్యాశాఖ అధికారులు ప్రారంభించారు.

# ఉదయ భాను చిబ్ అక్రమ అరెస్టుపై భగ్గుమన్న యూత్ కాంగ్రెస్ ..

**-శాంతియుత నిరసనలో వేజండ్ల సాయి**

**ఖమ్మం ప్రతినిధి సూర్య (మేజర్ న్యూస్)**
దేశంలో బిజెపి నియంత పాలన సాగిస్తూ కాంగ్రెస్ పార్టీ నీ కట్టడి చేయాలని చూస్తూ నేషనల్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉదయ భాను ఛిబ్ అక్రమంగా అరెస్టును నిరసిస్తూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఆద్వర్యంలో ఖమ్మం జిల్లా అధ్యక్షులు వేజశీడ్ల సాయి కుమార్ పాల్గొన్నారు.బిజెపి అక్రమ అరెస్టు నిరసిస్తూ ఢిల్లీ లోరెండోవ రోజు నిరసన కార్యక్రమాలో నిర్వహించారు.ఈ సందర్భంగా సాయి కుమార్ శాంతియుత నిరసనలో పాల్గొని మాట్లాడుతూ దేశ స్వాతంత్రం నుండి మొదలు కొని తెలంగాణ ఇచ్చే వరకు కూడా కాంగ్రెస్ పార్టీ ముందుండి ప్రాణత్యాగం చేసిన దేశ సర్వోభమత్వాన్ని కాపాడుతూ పేదలను అన్నివిధాలుగా ఆదుకున్న సంఘటనను ఆయన గుర్తు చేస్తూ మి అక్రమ అరెస్ట్ లకు ఎవరు బయపడరని ఎచ్చరించారు.బిజెపి నియంతన పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,ప్రజాస్వామ్యాన్ని కాపడకుండ ,ప్రతిపక్ష స్వరాలను అణచివేయాలని చూడటం సరైన విధానం కాదని పేర్కొన్నారు.ఉదయ భాను ను విడిచే వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.నిరసన కార్యక్రమశీలో పాల్గొన్న రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి,కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ,ఖమ్మం జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు దేవరకొండ రాజీవ్ గాంధీ సంఘీభావం తెలిపారు.



# నిబద్ధత కలిగిన, నిఖార్సైన సిపిఎం కార్యకర్త డేగల తిరుమలరావు

**-ప్రజా రచయిత దేవేంద్ర**

**వైరా రూరల్(సూర్య న్యూస్):-**
మండల పరిధిలోని అష్ణగుర్తి గ్రామం నందు ఈనెల 13వ తేదీన అనారోగ్యంతో మరణించిన కామ్రేడ్ డేగల తిరుమలరావు సంస్మరణ సభ అష్ణగుర్తి గ్రామంలో గ్రామ సిపిఎం నాయకులు కంచర్ల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఎం సీనియర్ నాయకులు ప్రజా రచయిత దేవేంద్ర మాట్లాడుతూ కామ్రేడ్ డేగల తిరుమల రావు నిబద్ధత కలిగిన నికార్సైన సిపిఎం కార్యకర్త అని ఆయన మరణం అష్ణగుర్తి సిపిఎం పార్టీకి ప్రజానాట్యమండలి ఉద్యమానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామం సాయుధ రైతాంగ పోరాట వారసత్వంతో ఎన్ని అవాంతరాలు వచ్చినా ఎర్రజెండా వైపు నిలబడటంలో అనేక ఇబ్బందులు ఎదురైనా, భ్రమలు,ఫిరాయింపుల కాలంలో కూడా ఎర్ర జెండాను భుజానమోస్తున్నదని గ్రామ పార్టీని నిలబెట్టుకోవడంలో కామ్రేడ్ తిరుమలరావు పాత్ర కూడా చెప్పుకోదగిందని అటువంటి కార్యకర్తలను కోల్పోవడం బాధాకరమని అన్నారు. ఆ కుటుంబానికి సిపిఎం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేముల సదానంద్ మాట్లాడుతూ ప్రజానాట్యమండలి ఇచ్చిన ప్రతి పిలుపులో డప్పు సంకనేసుకొని ప్రజా చైతన్యం కోసం నిలబడిన ప్రజా కళాకారుడని చివరి వరకు నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడ్డ కళాకారుదని ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకు పోవడం అంటే ప్రజా కళల్ని బ్రతికించుకోవడమేనని అదే ఆయనకిచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ సంస్మరణ సభలో సిపిఎం మండల నాయకులు చిత్తారు నాగరాజు, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు నందిగామ కృష్ణ, చేరుకుమల్లి వెంకటేశ్వరరావు, తిరుమలరావు కుమారుడు డేగల ప్రభు గ్రామ నాయకులు కంచర్ల వెంకటి, ఆదిమల్ల వీరబాబు, యేసు,చంద్రం,హరి, నర్సింహా, వెంకటేష్ పాల్గొన్నారు.



## వెలుగుమట్ల బాధితులకు బాసటగా కేటీఆర్..

# నేడు ఖమ్మం పర్యటన



-ఖమ్మం వెలుగుమట్లలో ప్రభుత్వ విధ్వంసం..
బాధితులను పరామర్శించనున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,-వెలుగుమట్ల బాధితులకు బాసటగా నిలవనున్న గులాబీ దళపతి
-పేదల జీవించే హక్కును కాలరాస్తున్న రేవంత్ సర్కార్
-కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యంలో 'దమనకాండ'..
-పేదల ఇళ్లపై బుల్డోజర్ల దాడి దుర్మార్గం..
-ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్



ఖమ్మం సూర్య టౌన్ న్యూస్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 25 నెలల కాలంలో ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమై ఉందని, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీపై బురద జల్లే కార్యక్రమానికి తెరలేపిందని బిఆర్ఎస్ నాయకత్వం తీవ్రంగా విమర్శించింది. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని ధ్వంసం చేయడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని మండిపడింది. లగచర్లలో గిరిజన సోదరుల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం లాక్కునేందుకు అర్ధరాత్రి పూట పోలీసులను, పారా మిలటరీ బలగాలను పంపి గర్భిణీలు, వృద్ధులని కూడా చూడకుండా విచక్షణారహితంగా దాడి చేసిన చరిత్ర ఈ ప్రభుత్వానిది. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో 40 ఏళ్లుగా నివసిస్తున్న పేదల ఇళ్లను కూల్చివేసి వారిని రోడ్డున పడేశారు. "రేవంత్ అంకుల్.. మంచి చేస్తారని ఓటు వేస్తే మా ఇళ్లు కూల్చారు" అని చిన్న పిల్లలు ఏడుస్తున్నా ఈ ప్రభుత్వానికి కనీసం జాలి కలగడం లేదని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. నిన్న ఖమ్మం నడిబొడ్డున వెలుగుమట్ల గ్రామంలో జరిగిన ఘటన అత్యంత అమానుషం. భూదాన్ ట్రస్ట్ బోర్డు ద్వారా పట్టాలు పొంది, గత కొంతకాలంగా నివసిస్తున్న 1895 మంది పేద కుటుంబాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. కోర్టులో స్టేటస్ కో (Status Quo) ఆర్డర్ ఉన్నప్పటికీ, వేల సంఖ్యలో పోలీసులను మోహరించి ఒక యుద్ధ వాతావరణాన్ని సృష్టించారు. పత్రికా స్వేచ్ఛను హరించి, మీడియాను కూడా అనుమతించకుండా ఒక ఎన్‌కౌంటర్ సీన్‌ను తలపించేలా బుల్డోజర్లతో ఇళ్లను కూల్చివేయడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు. బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చేందుకు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) నేడు మధ్యాహ్నం 12:00 గంటలకు ఖమ్మం చేరుకోనున్నారు. వెలుగుమట్ల బాధితులను పరామర్శించి,



ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని స్వయంగా బాధితులందరికీ తక్షణమే పునరావాసం కల్పించాలని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని.

మానవ హక్కుల ఉల్లంఘనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాం. నేడు కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, నామా నాగేశ్వరరావు మరియు జిల్లా ముఖ్య నాయకులు పాల్గొంటారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని, బాధితులకు అండగా నిలవాలని పార్టీ తరపున విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, భాషబోయిన వీరన్న, మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బూల్, లీగల్ సెల్ బిచ్చాల తిరుమలరావు, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు తాజుద్దీన్, ఉద్యమకారులు పగడాల నరేందర్, నాయకులు తాతా ప్రసాద్, హనుమంతరావు, బలుసు మురళీకృష్ణ, మహ్మద్ రఫీ, మంచా నాయక్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ మొదటి రోజు పరీక్ష ప్రశాంతం....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
-ఇంటర్ మొదటి సంవత్సరం ద్వితీయ భాష పేపర్ -1 పరీక్షకు 17 వేల 667 మంది హాజరు,-విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి
-గాంధీచౌక్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





ఖమ్మం (సూర్య బ్యూరో):

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.జిల్లా కలెక్టర్, గాంధీచౌక్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి, పరీక్ష జరుగుతున్న తీరు, పరీక్షా కేంద్రం నిర్వహణ విధానం, ప్రశ్నపత్రాల భద్రత, హాల్ టికెట్ల పరిశీలన ప్రక్రియలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహి స్తూ, విద్యార్థు లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు చల్లని త్రాగునీరు సరఫరా చేయాలని, పరీక్ష కేంద్రానికి వచ్చే ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించాలని తెలిపారు. పరీక్షా గదుల్లో వెలు తురు, తాగునీరు, టాయిలెట్ నిర్వహణ సక్రమంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ ధైర్యం చెప్పారు. పరీక్ష సిబ్బంది తమ విధులను నిబద్ధతతో, భాధ్యతగా నిర్వహించాలని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. మొదటి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం ద్వితీయ భాష పేపర్-1 పరీక్షకు జనరల్, ఒకేషనల్ కలిపి 18 వేల 258 మంది హాజరు కావాల్సి ఉండగా, పరీక్షకు 17 వేల 667 మంది హాజరు కాగా, 591 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, ఎక్కడా మాల్ ప్రాక్టీస్ నమోదు కాలేదని, మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ వెల్లడించారు.జిల్లా కలెక్టర్ పరీక్షా కేంద్రం తనిఖీ సమయంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.



## ఇంజనీర్ లీలా మోహన్ జీవితం ఆదర్శం

-ప్రజల పక్షాన పనిచేసే వాళ్ళు ఎప్పటికి చిరస్మరణీయులే.
-వర్ధంతి సభలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు
-అనాధాలకు అన్నదానం చేసి ఔదార్యం చాటుకున్న స్నేహితులు

ఖమ్మం సూర్య టౌన్ న్యూస్





ప్రజల పక్షాన నిలబడి పని చేసే వాళ్ళు భౌతికంగా లేకపోయినా సమాజంలో చిరస్మరణీయులుగా నిలిచి పోతారని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కొనియాడారు.ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్ అనాథ ఆశ్రమంలో బుధవారం జరిగిన పంచాయతీ రాజ్ ఇంజినీర్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షులు మురారీ లీలా మోహన్ వర్ధంతి సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. లీలా మోహన్ మిత్ర బృందం సభ్యులైనా సీనియర్ పాత్రికేయులు ఆకుతోట ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ,లీలా మోహన్ ఇంజనీర్ గా ప్రజలకు సేవలు అందిస్తూనే మరోవైపు సమాజంలోని అట్టడుగు వర్గాలకు చేయుటనిచ్చేవారని కొనియాడారు. ఎంత కాలం జీవించమన్నది కాదని, ఎలా జీవించమన్నదే ముఖ్యమని ఆయన అన్నారు.చిన్న వయసులోనే లీలా మోహన్ మనకు దూరం ఐనప్పటికీ, ఆయన సేవలు కొనసాగించడం ద్వారా... ఆయన ఆశయాలు నెరవేర్చినవాళ్ళ మవుతామవని హితవు పలికారు.రెండు దశాబ్దాల క్రితం ఆయన స్వర్గీయులు ఐనప్పటికీ,లీలా మోహన్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆయన వర్ధంతి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.సమాజంలో పేద వర్గాల అభ్యున్నతి కోసం పని చేయడం ద్వారానే మన జీవిత లక్ష్యం నెరవేరుతోందని,అలాంటి కోవకు చెందిన లీలా మోహన్ చిరస్మరణీయుడని పేర్కొన్నారుఇంజనీర్ల తో పాటు మేధో సంపత్తి కలిగిన ప్రతి ఒక్కరూ, సమాజ పురోఅభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ప్రముఖ శ్రీకవిత విద్యాసంస్థల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్ మాట్లాడుతూ, ఈనాటి యువత విష సంస్కృతి ని విడనాడి, తమ భవిష్యత్ కు బాటలు వేసుకోవాలని సూచించారు. అలాగే లీలా మోహన్ వలె, వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తూనే...తన చుట్టూ ఉన్న సమాజానికి ఉపయోగపడుతూ,మంచి పేరు సంపాదించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముందుగా లీలా మోహన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనాథలకు అన్నదానం చేశారుఈ కార్యక్రమంలో రిటైర్ ఇంజనీర్ తెనాలి సుబ్బారావు, కార్పొరేటర్ నాగుల్ మీరా,అన్నం ఫౌండేషన్ అన్నం శ్రీనివాసరావు, సీనియర్ పాత్రికేయులు బొల్లం శ్రీనివాస్(సాక్షి),కనకం సైదులు (10టివి),వెన్నబోయిన సాంబశివరావు(టి న్యూస్),జి.ప్రశాంత్ రెడ్డి(వెలుగు),శెట్టి రజినీకాంత్(ప్రైమ్ నైన్ టివి), బి.ఉదయ్(ఆర్టివి),వనం నాగయ్య(కెరటం),మందటి వెంకట రమణ(నమస్తే తెలంగాణ)మందుల ఉపేందర్(మెగా టివి) ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగుద్దేటి రమేష్ బాబు(వార్త),కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, బండారి శేఖర్,పెరబోయిన తిరుపతి రావు,జర్నలిస్టులుతదితరులు పాల్గొన్నారు.

# అనంతారం గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్యం పనులపై ప్రత్యేక దృష్టి

## -గ్రామ వీధులు పరిశుభ్రంగా ఉండేలా సర్పంచ్ కొరసా రమేష్ చర్యలు





జూలూరుపాడు, సూర్య(మేజర్ న్యూస్) మండలంలోని అనంతారం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల వీధులు పరిశుభ్రంగా ఉండాలని గ్రామ సర్పంచ్ కొరసా రమేష్ పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు.బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన పాలకవర్గం సమావేశం నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలకు సంబంధించి పాలకవర్గం నుంచి పలు సూచనలు తీసుకున్నారు. అనంతరం పాలకవర్గం సభ్యులతో కలిసి గ్రామంలో ముఖ్యంగా నెలకొన్న డ్రైనేజీ, పారిశుధ్య ఇతర సమస్యలను గ్రామస్తులు ద్వారా అడిగి తెలుసుకున్నారు.అనంతరం సర్పంచ్ కొరసా రమేష్ మాట్లాడుతూ తమ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నందున సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు. గ్రామస్తులు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని లేనియెడల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని రమేష్ సూచించారు. డ్రైనేజ్,పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుంజ రవికుమార్, పంచాయతీ సెక్రటరీ శైలజ,వార్డు సభ్యులు చాట్ల రామనాథం, పూనం పెద్దనరసింహారావు, బండారు అమల, ఇరప సునీత పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి...

## -మరో ఇద్దరి పరిస్థితి విషమం





ఇల్లందు ఆర్సీ సూర్య (మేజర్ న్యూస్)- ఇల్లందు మండలం సుదిమల్ల గ్రామపంచాయతీ పరిధిలోని జగదాంబ గుంపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే కోల్లాపురం గ్రామ పంచాయతీకి చెందిన కాయం సురేష్, పాయం చిన్ని ఇద్దరు ధనలక్ష్మి, జయశ్రీ లను మోటార్ సైకిల్ పై ఎక్కించుకొని ఒక వివాహ వేడుకలకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అయితే ఈ రెండు మోటారు సైకిళ్ళు ఒకదాని వెనుక ఒకటి వెళ్తూ అకస్మాత్తుగా ఒకరినొకరు తగలడంతో కింద పడిపోయారు. ఆ సమయంలోనే వెనకాల వస్తున్న ఒక టిప్పర్ వీరి మీది నుండి వెళ్లగా ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. వాహన చోదకులైన పాయం సురేష్ పాయం చిన్ని ల పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల గ్రామం సంఘటన స్థలానికి దగ్గరగా ఉండటంతో వారి బంధువులు తండోప తండాలుగా వచ్చి రోధిస్తున్న తీరు చూస్తుంటే ప్రతి ఒక్కరి హృదయం ద్రవించింది. ప్రమాదం జరిగిన వెంటనే ఇల్లందు సిఐ తాటిపాముల సురేష్ తన సిబ్బందితో వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను వెంటనే ఆటోలపై ఎక్కించి ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థులలో ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానం పెరిగేలా చూడాలి

## - జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి. ప్రభాకర్ రెడ్డి





మధిర, సూర్య మేజర్ న్యూస్ : ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల ఆంగ్ల పఠన సామర్థ్యాన్ని 100 శాతం పెంచే లక్ష్యంతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రవేశపెట్టిన ప్రత్యేక కార్యక్రమమే 'ఎవ్రీ చైల్డ్ రీడ్స్' ఈ కార్యక్రమం ద్వారా రోజుకు ఒక గంట ప్రత్యేక శిక్షణ, ఫోనెటిక్స్ ఆధారిత పద్ధతులను ఉపయోగించి పిల్లల్లో ఇంగ్లీష్ చదవడంపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏర్పాటుచేసిన కార్యక్రమం .దీనిలో భాగంగా బుధవారం మధిర మండల పరిధి లోని సిరిపురం ప్రాథమిక పాఠశాల, హరిజనవాడ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలో జిల్లా అకాడమిక్ అధికారి పి. ప్రభాకర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తరగతి గదుల పరిశీలన పాఠశాలలో జరుగుతున్న ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమాన్ని మరియు ఫౌండేషనల్ లెర్నింగ్ సర్వే కోసం జరుగుతున్న సన్నద్ధతను పరిశీలించారు ప్రాథమిక పాఠశాలలో రెండు మూడవ తరగతి విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించిన అనంతరం వర్క్ బుక్కుల కరెక్షన్ను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించి ప్రతి తరగతిలోని ప్రతి విద్యార్థి చదివేలాగా ప్రోత్సహించాలని విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధనఅభ్యసన ప్రక్రియలను చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు...

# ఇంటర్ పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన సీఐ నాగరాజు రెడ్డి




అశ్వారావుపేట టౌన్ సూర్య (మేజర్ న్యూస్ )- ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న సందర్భంగా అశ్వారావుపేట సీఐ పి.నాగరాజు రెడ్డి పరీక్ష కేంద్రాలను సందర్శించారు. పరీక్షా కేంద్రాలను స్వయంగా తనిఖీ చేసిన సీఐ, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు, అందుబాటులో ఉన్నాయో లేదో తనిఖీ చేసిన సీఐ, అవసరమైతే వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు, జిరాక్స్ మెషిన్లు అన్ని మూసివేయాలని, ఎటువంటి అక్రమాలు జరగకుండా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. అదే సమయంలో పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేయాలని, కట్టుదిట్టమైన సీసీటీవీ మానిటరింగ్ ఏర్పాటు చేయాలని పోలీసులకు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐతో పాటుగా అడిషనల్ ఎస్సై అఖిల, సిబ్బంది పాల్గొన్నారు

# బాలాజీ బ్రహ్మోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే...



అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్)- శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ మేనేజర్ పాకల వెంకటరమణ బుధవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ను గడుగులపల్లి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకం కలిశారు. మండల కేంద్రంలోని ప్రముఖ వైష్ణవాలయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 28వ తేదీ నుండి మార్చి 5వ తేదీ వరకు జరగనున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 2వ తేదీ రాత్రి 10 గంటలకు జరిగే శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి తిరు కళ్యాణ మహోత్సవంలో పాల్గొనాలని ఆలయ మేనేజర్ ఆహ్వానించారు . ఈ కార్యక్రమంలో శివాలయ చైర్మన్ మల్లెల నరసింహారావు, బాలాజీ ఆలయ సీనియర్ అసిస్టెంట్ ఉడతనేని రామారావు, ప్రధాన అర్చకులు ప్రతాపురం ప్రసాదాచార్యులు, తదితరులు ఉన్నారు.

# వైరా ఏసిపి సారంగపాణిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్యవైశ్య నాయకులు...



వైరా రూరల్(సూర్య న్యూస్):- వైరా ఏసిపి సారంగపాణిని వైరా ఆర్యవైశ్య నాయకులు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు... ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు... ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, ఆర్యవైశ్య కళ్యాణమండపం అధ్యక్షులు డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి , ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మొదటి ఉపాధ్యక్షులు నూకల శ్రీనివాసరావు, ఆర్య సంఘం జిల్లా నాయకులు గజ్జల కృష్ణమూర్తి , నూకల ప్రసాదరావు , వైరా మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మిట్టపల్లికిరణ్ కుమార్ సెక్రెటరీ కొల్లా రాంబాబు, గజ్జల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన మహిళా సంఘాలు

**– చిన్నారి హత్యకు నిరసనగా
అమరవీరుల స్థూపం వద్ద నిరసన
– రజక సంఘం నిరసనకు మద్దతు
తెలిపిన డిహెచ్పిఎస్ నేత రత్నకుమారి**



కొత్తగూడెం,సూర్య(మేజర్ న్యూస్ )– రాష్ట్రంలో పచ్చిమిరపోతున్న కుల దృహంకారాన్ని అంతం పలకాలని డిమాండ్ చేస్తూ రజక సంఘంతో పాటు డి హెచ్ పి ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మహిళలు పెద్ద ఎత్తున క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్పొరేషన్ కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని సూపర్ బజార్ నుంచి ప్రారంభమైన అండర్ బ్రిడ్జి మీదగా ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లోని అమరవీరు స్థూపం వరకు కొనసాగింది. అనంతరం రెడ్డి కులస్తుల దృహంకారానికి బలైన చిన్నారి మృతికి నిరసనగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించడం జరిగింది. కొత్తగూడెం రజక సంఘం నుండి జరిపిన ర్యాలీలో నాగర కర్నూల్ ఉమ్మెర గ్రామంలో జరిగిన మల్లన్న జాతరలో రజక కులానికి (చాకలి) చెందిన కుటుంబం జాతరకు వెళ్లిన సందర్భంలో టికెట్ తీసుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది. జాతరకు సంబంధించిన రెడ్డి కులానికి చెందిన యజమానులు కోరగా తాము రజక కులానికి చెందిన వారమని, ఊరికి సంబంధించిన విషయలలో, గుళ్ళల్లో జరిగే కార్యక్రమాలలో మంచి చెడుకు మా రజక కులస్తుల మే ముందు ఉంటాము కదా మా దగ్గర కూడా టికెట్ తీసుకుంటారా అని ప్రశ్నించిన పాపానికి ముకుపచ్చలారని చిన్నారిని కాళ్లతో తన్ని హతమాచారని నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మహిళా సంఘాల నాయకురాలు ఆరోపించారు. ఈ విషయంలో వచ్చిన వాదనలో గొడవలు జరిగి రజక కుటుంబంలో వారిని కొడుతుండగా వారు రెండు నెలల పాపను యజమాని పాదాల వద్ద పాపను పడుకోపెట్టి మమ్మల్ని కొట్టకండి అని గణేష్, మౌనిక, బ్రతిమిలాడుతున్నప్పటికి వినిపించుకోకుండా నానా దుర్భాషలాడటం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దేవాలయ యజమాని చిన్నారిని కాలితో విసిరి కొట్టడం జరిగిందని దీంతో గాయపడిన ఆ చిన్నారి హాస్పటల్లో చికిత్స పొందుతూ చనిపోవడం జరిగినదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము చాకలి వారమని తక్కువ కులం అని, మీరు రెడ్డి కులానికి చెందిన వారని, మమ్మల్ని చిన్నచూపు చూస్తూ మా కుటుంబాన్ని కొట్టి ఇబ్బంది పెడుతు మా పాప చావుకు కారణం అయిన వారిని కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాల డిమాండ్ చేశాయి. కాగా చిన్నారిని కోల్పోయిన ఆ కుటుంబ సభ్యులు రోదన చూస్తుంటే చూసేవారికి కంటి నీరు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా ఇంకా ఈ కులమతాలను రెచ్చగొడుతున్న వారి కుల దుహంకరణకు అంతం ఎప్పుడని వారు ప్రశ్నిస్తున్నారు.లోకాన్ని చూడవలసిన ఆ చిన్నారి తక్కువ కులంలో పుట్టడం నేరమా? అంటూ ఇలాంటి కుల అహంకారానికి బలైన సంఘటనలు చాలా చోట్ల జరుగుతున్నాయని, వీటిని అంతం చేయాలంటే కొత్త చట్టాలు తీసుకువచ్చి కఠినంగా శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఆ పసిపాప ని పొట్టన పెట్టుకున్న వారికి కఠిన శిక్ష పడాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రజక సంఘం నిర్వహించిన ఈ ర్యాలీకి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను నుండి మద్దతు తెలుపుతూ, సూపర్ బజార్ నుండి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి బస్టాండ్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రజక సంఘ నాయకురాళ్లు సత్తెనపల్లి విజయలక్ష్మి, ధనలక్ష్మి, డిహెచ్పిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కరిష రత్నకుమారి, మైనార్టీ నాయకురాలు కైసర్ పాల్గొనడం జరిగినది.

# నేడు గుడిపాడు మోక్ష వెంకటేశ్వర స్వామి కళ్యాణం

**– పాల్గొనున్న వేలాదిమంది భక్తులు.
– నూతన ఆలయ ప్రతిష్టా ఉత్సవాలు.**

పాల్వంచ, సూర్య(మేజర్ న్యూస్)– భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం రామచంద్రపురం (గుడిపాడు)లో శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ ఎన్ .సురేష్ రేడ్డి ఆధ్వర్యంలో శ్రీ మోక్ష వేంకటేశ్వర స్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా బుధవారం గుడిపాడు (రామచంద్రాపురం) గ్రామంలో శ్రీ మోక్ష వెంకటేశ్వర స్వామి వారి దేవాలయ దివ్య ప్రతిష్ట మహోత్సవంలో ఉదయం స్వామివారికి పంచగవ్య స్నపనము, కర్మాంగ స్నపనము పూజా కార్యక్రమాలు వేద పండితులచే నిర్వహించారు. అధిక సంఖ్యలో స్వామివారి భక్త మహాశయులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.





# మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై ఆరోపణలు చేస్తే సహించేది లేదు.. మాజీ జెడ్పిటిసి పైడి ఫైర్..



దమ్ముపేట సూర్య (మేజర్ న్యూస్) నిస్వార్థ ప్రజా సేవకుడిగా పేరుగాంచి గత 45 సంవత్సరాల రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడిగా నిత్యం అభివృద్ధికి బాటలు వేస్తూ ప్రజల నీరాజనాలు అందుకుంటున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై సోషల్ మీడియా కొంతమంది చేస్తున్న ఆరోపణలపై మాజీ జెడ్పిటిసి, తుమ్మల ముఖ్య అనుచరుడు, ఖమ్మం ఉమ్మడి జిల్లా సీనియర్ రాజకీయ నాయకుడు పైడి వెంకటేశ్వరరావు ఫైర్ అయ్యారు ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల అంశాన్ని అడ్డుపెట్టుకొని వ్యక్తిత్వ హ నానికి పాల్పడుతున్న కొంతమంది సోషల్ మీడియా వ్యక్తులు చేసిన ఆరోపణలపై ఆయన మండిపడ్డారు కొంతమంది రాజకీయ నాయకుల గుప్పెట్లో ఉంటూ వారు చెప్పినదల్లా చేసుకుంటూ మచ్చలేని నాయకులపై బురదజల్లే ప్రయత్నం చేయడమే వీరికి అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు వెలుగుమట్ల భూములకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఎటువంటి సంబంధం లేదని ఏనాడో కోర్టు తీర్పునిచ్చిందని అన్నారు ఈ క్రమంలోనే భూదాన్ బోర్డు ఫిర్యాదు మేరకు అక్కడ అధికారులు చర్యలు చేపట్టారని తెలిపారు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా ముద్ర వేసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై బురదజల్లే ప్రయత్నం చేయడమంటే అరచేతితో సూర్యుడు ఆపటమేనని ఆయన హితువు పలికారు మీ స్థాయిని మరిచి ఆయనపై ఆరోపణలు చేయడం అవివేకమని ఆయన ధ్వజమెత్తారు ఇకనైనా ఆరోపణలు మానుకొని మంత్రి తుమ్మల ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించాలని ఆయన అన్నారు

# ప్రమాదంలో గాయపడిన గుండెపిన్ని వెంకటేశ్వర్లు

**–పరామర్శించిన వేల్పుల నరసింహారావు**



జూలూరుపాడు,సూర్య(మేజర్ న్యూస్)జూలూరుపాడు సిపిఐ పార్టీ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు కు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్ర గాయమైంది. ఖమ్మం లోని ఓ హాస్పిటల్ లొ చికిత్స పొందుతున్న గుండె పిన్ని వెంకటేశ్వర్లు ను తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు,కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల్పుల నరసింహారావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ని అడిగి తెలుసుకున్నారు. కాలి గాయం నుండి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు

# స్తోమత గల ప్రతి ముస్లిం తప్పక ఫీత్ర దానం చెయ్యాలి

**– రాష్ట్ర మైనారిటీ నాయకులు డా. నయీమ్ ఖురేషి.**



కొత్తగూడెం, సూర్య(మేజర్ న్యూస్ )– అంజుమన్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షులు అమీర్ ఖాద్రి రైల్వే మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని నయీమ్ ఖురేషి పవిత్ర రంజాన్ మాసంలో కఠోర ఉపవాస డిఖషాలు ఉంటున్న ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నయీమ్ ఖురేషి మరియు ఏ డబ్లు ఎస్ అధ్యక్షులు అమీర్ ఖాద్రి మాట్లాడుతు ఇస్లాం లో జాకాత్ అనంతరం ఫిట్రా ప్రతి స్తోమత కల్గిన ముస్లిం వ్యక్తి రంజాన్ పండుగ నమాజు కు ముందు ఫిత్ర దానం నిరుపేద వారికీ చెయ్యాలని దీనికై అంజూమ్ వెల్ఫేర్ సొసైటీ ఒక్క ఫీత్ర అనగా రు.120 గ నిశ్చాయించడం జరిగిందని తెలుపుతు జిల్లా ముస్లిం సోదరులకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు.

# అధికారుల మెప్పుకోసం కంపెనీకి రాని లాభాలు చూపించిన యాజమాన్యం

**– సమగ్ర విచారణ కొరకు కోల్ శాఖ మంత్రి కి సింగరేణి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు" మంద"**



కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)– సింగరేణిలో సంవత్సరానికి గాను బొగ్గు నిల్వల (కోల్ స్టాక్) స్థాయి 1 మిలియన్ టన్నుల లోపు ఉంటుందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్( సీఐటీయూ ) రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కానీ 2024–25 సంవత్సరానికి గాను దాదాపు 7 మిలియన్ టన్నులు చూపించారని. 6 మిలియన్ టన్నులు ఎక్కువ గా చూపించారని ఆరోపించారు. దీనివల్ల కంపెనీకి అదనంగా సుమారు రూ. 2500/– కోట్లు రాని లాభం చూపించినట్లయిశీదని పేర్కొన్నారు. దీనివల్ల కంపెనీకి డివిడెంట్లు, సెస్, డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ ఇతర టాక్స్ ల రూపాలలో కంపెనీ నష్టపోయిందిని స్పష్టం చేశారు. రాని లాభాలు చూయించి ఉన్నతాధికారుల యొక్క పబ్బం గడుపుకోవటానికి చేసిన ప్రయత్నం ఇదేనని వివరించారు. దీనితోపాటు బొగ్గు నిల్వల లోటు పూడ్చటం కంపెనీకి ఇబ్బంది కరంగా మారిందన్నారు. కాబట్టి దీనిపై సిఐటియుగా కోల్ మినిస్టర్ కిషన్ రెడ్డి, కోల్ సెక్రటరీకి(2023–24అండ్ 2024–25 సం. లకు) బొగ్గు నిల్వల పై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూడాలని ఆయన తన లేఖలో పేర్కొన్నారు.

# నేడు దేశవ్యాప్త నిరసన లో భాగంగా బిఎంఎస్ పాటించిన "నిరసన దినం"

– ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో కార్మిక వర్గం కార్యాలయాల్లో నిరసనలు
– కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
– బి ఎం ఎస్ అనుబంధ సింగరేణి కోల్ మేన్స్ కార్మిక సంఘం నేతలు






కొత్తగూడెం సింగరేణి, సూర్య(మేజర్ న్యూస్)– ఒడిశాలోని పూరీలో జరిగిన 21వ అఖిల భారత మహాసభలలో ఇచ్చిన పిలుపు మేరకు భారతీయ మజ్దూర్ సంఘ్ ( బి ఎం ఎస్ ) పిలుపుమేరకు బుధవారం దేశవ్యాప్తంగా "నిరసన దినం"గా నటించింది.వివిధ రంగాలు, పరిశ్రమలలో కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచడానికి బి.ఎం.ఎస్ అన్ని జిల్లా ప్రధాన కార్యాలయాలలో ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించడం జరిగింది.బి ఎం ఎస్ ప్రభుత్వం ముందు అనేక ముఖ్యమైన సమస్యలను నిరంతరం లేవనెత్తుతూనే ఉంది . అయితే, ప్రతిస్పందన మందకొడిగా, తగినంతగా ఫలితం లేకపోవడంతో ఆడు నుంచి చూడడానికి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆ నేతలు పేర్కొన్నారు.లక్షలాది మంది మిడ్–డే భోజన కార్మికులు, ఆశా కార్మికులు ఇప్పటికీ తక్కువ గౌరవ వేతనాలను పొందుతున్నారని తమ నిరసనలలో భాగంగా పేర్కొన్నారు. ఐదు దశాబ్దాల సేవ తర్వాత కూడా, అంగన్‌వాడీ కార్మికులు రోజుకు 10 గంటలకు పైగా పని చేయవలసి వచ్చినప్పటికీ, వారిని ఇప్పటికీ స్కీమ్ వర్కర్లుగా మాత్రమే పరిగణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నిరంతరం పెరుగుతున్న పనిభారంతో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ తన గౌరవ వేతనాన్ని పెంచడానికి ఇష్టపడటం లేదని,నిరంతరం అదనపు బాధ్యతలను కేటాయిస్తోందని వివరించారు. ఎనిమిది రాష్ట్రాల్లోని నేషనల్ టెక్స్‌టైల్ కార్పొరేషన్ మిల్లుల కార్మికులు మహమ్మారి నుండి కేవలం 50% వేతనాలు మాత్రమే పొందుతున్నారని ప్రభుత్వ కార్యాలయాలు వద్ద జరిగిన నిరసన కార్యక్రమలల్లో తెలిపారు , గత పది నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాంచీలోని హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ ఉద్యోగులకు గత 32 నెలలుగా జీతాలు అందలేదని, అనేక ఇతర యూనిట్ల పరిస్థితి కూడా ఇదే. ఈపీఎస్–95 కింద రు. 1,000 కనీస పెన్షన్ మారలేదని , దీనివల్ల లక్షలాది మంది పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు . బ్యాంకు ఉద్యోగులు కూడా వారానికి ఐదు రోజుల పని దినం అమలు కోసం ఆందోళన చేయవలసి వస్తుందని తెలిపారు.ఈ తీవ్రమైన ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని, దేశవ్యాప్తంగా బి ఎం ఎస్ అనుబంధ యూనిట్లు ధర్నాలు, నిరసనలు, ప్రదర్శనలు, ర్యాలీలు, గేట్ మీటింగ్‌లు నిర్వహించాయని పేర్కొన్నారు. అంతేగాక నల్ల బ్యాడ్జీలు ధరించాయని, ప్రధానమంత్రి, కేంద్ర కార్మిక మంత్రి సంబంధిత రాష్ట్రాల ముఖ్యమంత్రులకు జిల్లా అధికారులు మెమోరాండం ద్వారా ఈ క్రింది వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తాయన్నారు. ప్రధానంగా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న డిమాండ్ పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది.అంత్యోదయ నిజమైన స్ఫూర్తితో, మినహాయింపు లేకుండా, అన్ని రంగాలు, కార్మికుల వర్గాలలో కార్మిక చట్టాలను కఠినంగా సార్వత్రికంగా అమలు చేయడం జరిగిందన్నారు.పారిశ్రామిక సంబంధాల కోడ్, 2020 మరియు వృత్తి భద్రత, ఆరోగ్యం మరియు పని పరిస్థితుల కోడ్, 2020 లోని కార్మికుల సమస్యలను పరిష్కరించండి సరిదిద్దాలని సూచించారు.కార్మికుల సంక్షేమం కోసం అవి క్రమం తప్పకుండా, సమర్థవంతంగా, అర్థవంతంగా పనిచేసేలా చూసుకోవడానికి ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌ను వెంటనే సమావేశపర చాలన్నారు. వివిధ త్రిసభ్య కమిటీలను పునర్నిర్మించాలని పేర్కొన్నారు.అన్ని పథకాల కార్మికులకు నెలవారీ గౌరవ వేతనాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. ఈపీఎస్– 95 కింద కనీస పెన్షన్‌ను రూ. 1000 నుండి రూ. 7500 కు పెంచాలని కోరారు.ఎన్ టి సి మిల్స్, హెచ్ ఇ సి రాంచీ, ఐటిఐ, హెచ్ఎంటి మొదలైన పి ఎస్ యు లలో వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

బ్యాంకింగ్ పరిశ్రమలో "వారానికి 5 రోజుల పని దినం" ప్రవేశపెట్టడం.

ఈపీఎస్ –95 కింద కనీస పెన్షన్‌ను నెలకు ₹1,000 నుండి ₹7,500కి పెంచడం, దానితో పాటు డియర్‌నెస్ రిలీఫ్ కూడా ఇవ్వాలి. ఈ ఎస్ ఐ ఈపీఎఫ్ కింద కవరేజ్ కోసం థ్రెషోల్డ్ పరిమితులను పెంచడం ద్వారా కార్మికులలో ఎక్కువ మందికి ప్రయోజనాలను అందించాలి. 1965 బోనస్ చెల్లింపు చట్టం ప్రకారం బోనస్ చెల్లింపుకు అర్హత పరిమితిని ప్రస్తుత వేతన స్థాయిలకు అనుగుణంగా పెంచడం.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 16, 21 లలో పొందుపరచబడిన సూత్రాలకు అనుగుణంగా స్కీమ్ వర్కర్లను మరియు కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించడం. జనరల్ రిక్రూట్‌మెంట్‌పై నిషేధాన్ని వెంటనే ఎత్తివేసి, ఉద్యోగ భద్రతతో కూడిన హామీతో కూడిన ఉపాధిని నిర్ధారించడం, సేవా పరిస్థితుల్లో అనిశ్చితి మరియు అభద్రతను తొలగించడం.కార్మికుల ప్రయోజనాల దృష్ట్యా మరియు జాతీయ అభివృద్ధి దృష్ట్యా ఈ దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని భారతీయ మజ్దూర్ సంఘ్ కోరుతోంది.ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించి కలెక్టర్ కి మెమోరాండం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బిజ్జం అశోక్ రెడ్డి, సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ముఖ్య సంఘటన కార్యదర్శి టీ. ఎస్ పవన్ కుమార్, సింగరేణి రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు సంఘం చందర్, టీవీ సూరి బి ఎం ఎస్ రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వర్లు, బి ఏం ఎస్ వైస్ ప్రెసిడెంట్ జి వేణుగోపాల్, ఐ టి సి పేపర్ బోర్డ్ నాయకులు పి శ్రీనివాసరావు , సర్వేశ్వరరావు, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 16 టైర్ల టిప్పర్లతో నష్టం... రెండో రోజు కొనసాగుతున్న నిరసన

**–12,14 టైర్ల టిప్పర్ల ఓనర్ల ఆవేదన...**

టేకులపల్లి సూర్య (మేజర్ న్యూస్):టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఉపరితగని నుంచి నవభరత్, బీపీఎల్ కు బొగ్గు రవాణా చేస్తున్న 12,14 టైర్ల లారీ ఓనర్లు, 16 టైర్ల లారీలు వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టేకులపల్లి మండలంలోని చుక్కలబోడు సమీపంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద 12,14 టైర్ల లారీలు ఓనర్లు, లారీలను నిలిపి బుధవారం రెండో రోజు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లారీ ఓనర్లు, డ్రైవర్లు మాట్లాడుతూ... గతంలో మాదిరిగానే 12,14 టైర్ల లారీలను మాత్రమే నవభరత్, బీపీఎల్ కు వెళ్ళే విధంగా చూడాలని, 16 టైర్ల వస్తే ఎక్కువ టన్నుల బొగ్గు వారికి లోడ్ అవుతుందని, తద్వారా తమకు తీవ్ర అన్యాయం జరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 16 టైర్ల లారీల ద్వారా నవభరత్, బిపిఎల్ కు బొగ్గు లోడ్ ఇస్తే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, లారీలకు ఈఎంఐ కట్టే పరిస్థితి కూడా ఉండదని అన్నారు. 16 టైర్ల బండ్లను ఇల్లెందుకు చెందిన ఓ కాంట్రాక్టర్ తీసుకురావడం తమకు అన్యాయం జరుతుందని, ప్రజా ప్రతినిధుల సహకారం తనకే ఉందని ఆరోపించారు. దీంతో లారీల ఓనర్లకు ఉరితాడు అవుతుందని, కుటుంబాలు ఇబ్బందుల పాలవుతామని అన్నారు. గతంలో లానే లారీలను నడిపి తమకు ఇల్లందు ఎమ్మెల్యే న్యాయం చేయాలని కోరారు.



## వధూవరులకు నూతన వస్త్రాలు బహుకరించిన బిజెపి మండల అధ్యక్షుడు భూక్యా రమేష్



జూలూరుపాడు,సూర్య(మేజర్ న్యూస్)మండలంలోని బేతాలపాడు గ్రామానికి చెందిన బానోతు మోహన్ కుమారుడి వివాహం బుధవారం స్థానిక యల్లంకి గార్డెన్ లో జరిగింది.ఈ కార్యక్రమానికి బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా రమేష్ హాజరై నూతన వధూవరులకు నూతన వస్త్రాలను బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామారావు,గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు భూక్యా రవి తదితరులు పాల్గొన్నారు

## సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**– జి.ఎంకు మెమరాండం అందజేసిన ఐ ఎన్ టి యు సి ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్**

కొత్తగూడెం సింగరేణి, సూర్య(మేజర్ న్యూస్ )– కొత్తగూడెం ఏరియాలోని కార్మికులు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐఎన్టియుసి కొత్తగూడ మీడియా ఉపాధ్యక్షులు యండి రజాక్ డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఏం శాలెం రాజును కలిసి మెమొరండం అందజేయడం జరిగింది. ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, ఐఎన్టీయూసీ నాయకులు, ముఖ్యంగా కొత్తగూడెం ఏరియాలో అండర్ గ్రౌండ్ లో చేయుచున్న జనరల్ అసిస్టెంట్లను సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్లుగా త్వరగా నియమించాలని కోరారు. ఏరియాలో 150 నుండి 200 వరకు సర్ఫేస్లో వచ్చే విధంగా చూడాలని , కొత్తగూడెం ఏరియాలోని రిటైర్మెంట్ అయిన ఉద్యోగులు ఖాళీ చేసిన క్వార్టర్లలో రేకులు, డోర్లు చూస్తున్నారని వాటిని తీయకుండా చూడాలని ఆ వినతిపత్రంలో కోరారు.కొత్తగూడెం ఏరియాలోని, రామవరం నందు బ్యాంకు సౌకర్యం, షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.సింగరేణి సంస్థ నందు పనిచేయుచున్న ఉద్యోగులకు రిటైర్మెంట్ అయిన రోజునే వారికి వచ్చే అన్ని బెనిఫిట్స్ ఇచ్చే విధంగా చూడాలని సూచించారు. వివిధ ఏరియాలకు డిప్యూటేషన్ మీద వెళ్లిన ఆపరేటర్లు, టెక్నీషియన్స్, తదితర డెసిగ్నేషన్ ఉద్యోగులను వెంటనే వి.కే.సి.ఎం, కు తీసుకువచ్చే ఏర్పాటు చేయాలని ఆ లేఖలో పేర్కొన్నారు. కొత్తగూడెం ఏరియాలోని మైన్స్, ఓపెన్ కాస్ట్, డిపార్ట్మెంట్లలో మ్యాన్ పవర్ తక్కువగా ఉన్నందున ఉద్యోగులను భర్తీ చేయాలన్నారు. కొత్తగూడెం ఏరియాలోని ఏరియా వర్క్షాప్ నందు జూనియర్ అసిస్టెంట్ ( క్లర్క్) ఒక్కరే ఉండడం వల్ల స్టోర్స్, మ్యాన్ వే ఆఫీస్ వర్క్, చేయడం ఇబ్బందికరంగా ఉందన్నారు.ఉద్యోగులకు రావలసిన ఇంక్రిమెంట్స్, బెనిఫిట్స్, రిటైర్డ్ అయిన ఉద్యోగుల బెనిఫిట్స్ రావడానికి ఇబ్బందికరంగా ఉందని వివరించారు.కాగా ఇద్దరు క్లర్కులను ఏర్పాటు చేయాలని , ఏరియా వర్క్ షాప్ నందు క్యాంటీన్ బిల్డింగ్ లేకపోవడంతో ఉద్యోగులకు అసౌకర్యంగా ఉందని, త్వరగా క్యాంటీన్ బిల్డింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు.కార్మికులకు ఖాళీగా ఉన్న ప్లేస్లలో ప్రమోషన్ ఇచ్చే విధంగా చూడాలన్నారు.. ప్రమోషన్ రావలసిన కార్మికులకు త్వరగా ఇచ్చే విధంగా చూడాలని తెలిపారు. తెలిపిన సమస్యలను జి.ఎం సానుకూలంగా స్పందించి త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ బూటిక రాజేశ్వరరావు, తీగల క్రాంతి కుమార్, ఫిట్ కార్యదర్శిలు చిలక రాజయ్య, గోపి కుమారస్వామి, ఎండి సత్తార్ పాష, ఈ మోహన్ రెడ్డి, కె నటరాజ్,మల్లికార్జునరావు, పి నాగేశ్వరరావు, భాను కమల్, కిషోర్ , రవీందర్సెంట్రల్ మెంబర్స్ మరియు బ్రాంచ్ కమిటీ మెంబర్స్ ఎం కొమురయ్య, పోశం శ్రీనివాస్, జల్లి కిరణ్, శ్రీనివాస్, కలవాల శ్రీనివాస్, డి. శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, కిషోర్, కట్ట నరసింహారావు, కే కుమార్, గులం గౌస్, పూర్ణ, వినయ్, ఎర్రబల్లి ఈశ్వర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ వికాసం, రైతుల సంక్షేమమే మోదీ ప్రభుత్వ ధ్యేయం

- ఉపాధి హామీలో విప్లవాత్మక మార్పులు
- యూరియా పంపిణీలో కాంగ్రెస్ సర్కార్ ఘోర వైఫల్యం..
- భూదాన్ బాధితులకు తక్షణమే న్యాయం చేయాలి
- మీడియా సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బసవపురం లక్ష్మీనారాయణ. , బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు.


**ఖమ్మం, సూర్య (మేజర్ న్యూస్):**
రైతులు, పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం అని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బసవపురం లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని మినర్వా గ్రాండ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 'వికసిత్ భారత్ 2047' లక్ష్యంగా గ్రామాల్లోని వ్యవసాయ కూలీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేంద్ర ప్రభుత్వం వినూత్న సంస్కరణలు తీసుకువచ్చిందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని పక్కదారి పట్టించి నిధులు దుర్వినియోగం చేసిన నేపథ్యంలో, పారదర్శకతను పెంచేందుకు సరికొత్త చట్టాన్ని తీసుకువచ్చినట్లు ప్రకటించారు. ఈ చట్టం ద్వారా ఉపాధి హామీ పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచడంతో పాటు, ప్రత్యేకంగా 60 రోజులు వ్యవసాయ పనులకు కేటాయించడం రైతాంగానికి ఎంతో మేలు చేస్తుందని ఆయన వివరించారు. రాష్ట్రంలో ఎరువుల పంపిణీ కోసం ప్రవేశపెట్టిన యాప్ విధానంపై అధికారులకు కనీస అవగాహన లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యాప్‌ల పేరుతో రైతుల ప్రాణాలతో చెలగాటం ఆడటం మానుకుని సాంకేతిక లోపాలు సవరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఉపాధి హామీ పథకం కోసం కేంద్రం ఏకంగా రూ.1,51,282 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, అందులో దాదాపు 95 వేల కోట్ల రూపాయలను అంటే 60 శాతాన్ని కేంద్రమే నేరుగా భరిస్తోందని ఆయన కుండబద్దలు కొట్టారు. మరోవైపు రైతులపై ఆర్థిక భారం పడకుండా మోదీ ప్రభుత్వం ఏటా రూ.1,25,000 కోట్ల భారీ సబ్సిడీతో ఎరువులను అందిస్తూ అండగా నిలుస్తుంటే, ఆ యూరియాను పారదర్శకంగా రైతులకు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. పాలకుల చేతకానితనం, అధికారుల నిర్లక్ష్యం వల్లే సబ్సిడీ యూరియా అంతా బ్లాక్ మార్కెట్ పాలవుతోందని, ఎక్కడా అవినీతి జరగకుండా ఆన్‌లైన్ పంపిణీ వ్యవస్థను కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర అధికారులదేనని ఆయన డిమాండ్ చేశారు.
అనంతరం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిప్పులు చెరిగారు. ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ముఖం చాటేస్తోందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రైతు భరోసా కింద ఇస్తామన్న నిధులు ఏమయ్యాయని ప్రభుత్వాన్ని నిలదీశారు. అన్నదాతలకు హామీ ఇచ్చిన విధంగా రైతు భరోసా అమలు




చేయడంలో రేవంత్ సర్కార్ ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. మాట తప్పి మడమ తిప్పిన కాంగ్రెస్ నాయకులకు ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో నిరుపేదలైన భూదాన్ భూముల బాధితులపై ప్రభుత్వం కనబరుస్తున్న అమానుష వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. దశాబ్దాల క్రితం దాతలు ఎంతో ఉదారంగా కటిక పేదల ఇళ్ల కోసం భూదాన్ యజ్ఞ బోర్డుకు ఇచ్చిన భూములలో, గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వారిపై అకారణంగా దాడులు చేయడం దారుణమన్నారు. కనీస ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండానే బుల్డోజర్లతో దాడులు చేసి దాదాపు 800 నిరుపేద కుటుంబాలను రాత్రికి రాత్రే రోడ్డున పడేయడం ఈ ప్రభుత్వ రాక్షసత్వానికి పరాకాష్ట అని ఆరోపించారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి, ఖమ్మం జిల్లా ఇంచార్జి ప్రభారి బద్దం మహిపాల్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, నాయకులు ఒక్క లంక సుబ్రహ్మణ్యం, గంట్యాల విద్యాసాగర్, మందడపు సుబ్బారావు, గుత్తా వెంకటేశ్వరరావు, నాయుడు రాఘవరావు, వీరవల్లి రాజేష్ గుప్తా, అల్లిక అంజయ్య, విజయ్ రాజు, నరుకుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి

-భూదాన్ భూములపై దుష్ప్రచారం చేస్తున్నారు
-విలేకరుల సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల,మాజీ జిల్లా అధ్యక్షుకు పువ్వాళ్ళ




**ఖమ్మం సూర్య (మేజర్ న్యూస్):**
కాంగ్రెస్ పార్టీ పేదల పక్ష పాతి అని,భూదాన్ భూములపై ప్రతిపక్షలు చేస్తున్న ప్రచారంపై చేస్తున్నారని, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్ లు మండిపడ్డారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, వెలుగుమట్ల భూదాన్ భూములపై ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారం పై తీవ్ర స్థాయిల మండిపడ్డారు..అక్కడ నిజంగా పేదలు ఉంటే ప్రభుత్వం వారికి న్యాయం చేస్తుందని ఆయన అన్నారు..తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ జీవితంలో ఎక్కడైనా భూమి కబ్జా చేశారా అని బి.ఆర్.ఎస్ నాయకుల ను ప్రశ్నించారు.. ఇప్పుడు భూదాన్ భూములను ప్రభుత్వ పరంగా వినియోగిస్తుంది తప్ప ఏ ప్రయివేటు కంపెనీలకో ఒప్ప చెప్పడానికి కాదన్నారు..గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం లో భూదాన్ భూముల ఆక్రమణ దారులను ఖాళీ చేయించడానికి ప్రయత్నం జరిగిందని,కోర్టు రెవెన్యూ అధికారులకు ఖాళీ చేయించే హక్కు లేదని తీర్పు ఇచ్చిందని ఆయన చెప్పారు.ఇప్పుడు సీసీఎల్ఏ వారు కోర్టు ఉత్తర్వులు ప్రకారం ఖాళీ చేయించారని ఆయన తెలిపారు..గతంలో అక్కడ నిర్మాణం చేసుకున్న ఓ పది మంది కోర్ట్ కు వెళ్ళినప్పుడు వారికి స్టే ఇచ్చిందని మిగతా వారికి ఇవ్వలేదని ఆయన అన్నారు.. కొంతమంది వ్యక్తులు దళారీలుగా మారి డబ్బులు తీసుకుని గుడిసెలు వేయించారని ఆయన మండిపడ్డారు..కోర్టు స్టే ఇచ్చిన 10 ఇళ్లను వదిలేసి మిగతా అక్రమనదారులను కాళీ చేయించడం జరిగిందని ఆయన చెప్పారు..భూదాన్ భూమి పంచాయతీ ఇప్పటిది కాదని గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం నుంచి ఉందన్నారు.గత ప్రభుత్వం లో ఉన్న మంత్రి కూడా ఖాళీ చేయించే ప్రయత్నం చేసింది వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు.బి.ఆర్.ఎస్ నాయకులు వాస్తవాలు తెలుసుకోకుండా రాజకీయం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు..మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీద బి.ఆర్.ఎస్ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని వాటిని పట్టించుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు..గత ప్రభుత్వం



లో జరిగిన ప్రక్రియనే ఇప్పుడు జరుగుతుందన్నారు..ఖమ్మం నియోజకవర్గనికి సంబంధించిన వారు అక్కడ 40 మంది కూడా లేరన్నారు..నిజమైన పేదలను గుర్తించి వారికి తప్పకుండా న్యాయం చేస్తామని ఆయన తెలిపారు..భూదాన్ భూములకు వ్యవహారానికి సంబంధించి కే.టి.ఆర్ వస్తున్నారని బి.ఆర్.ఎస్ నాయకులు చెప్తున్నారని వారి మాటలు విని కే.టి.ఆర్ వస్తే అబాసుపాలు అవుతారని ఆయన అన్నారు. అనంతరం వెలుగుమట్ల భూములలో నివాసం కోల్పోయిన సుమారు 30 కుటుంబాల పేదలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ కు వచ్చి నిజమైన నిరుపేదలకు ప్రభుత్వం తరపున లబ్ధి చేకూర్చాలని వినతి పత్రం అందజేసినారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఖమ్మం నగర డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారముక్తార్ ,ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు,ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పుచ్చలకాయల వీరభద్రం,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, తదితరులు పాల్గొన్నారు..

## ఐదవ రోజు శిక్షణా తరగతులకు విచ్చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసిన

-జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం సూర్య (మేజర్ న్యూస్):**
ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సంఘటన్ శ్రీజన్ అభియాన్ తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణా తరగతుల ఐదవరోజున సివిల్ సప్లయ్ అవలంభిస్తున్న విధానంపై, రైతు రుణ మాఫీ,సన్నవడ్లకు 500 రూపాయల బోనస్, గత ప్రభుత్వం అటకెక్కించిన రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్ల పథకం పునరుద్ధరణ ప్రజాపాలన గావిస్తున్న ప్రభుత్వ పథకాలపై సవివరంగా వివరించారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు దేవి ప్రసన్న,సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు దీపక్ జాన్,ఖమ్మం నగర కాంగ్రెస్ అద్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మ ఇతర జిల్లా అధ్యక్షులు,సిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఎదులాపురంమున్సిపాలిటీ వైస్ చైర్మన్‌ను ఘనంగా సన్మానించిన గ్రానైట్ సంఘం నాయకులు

**ఖమ్మం (సూర్య బ్యూరో):**



మంచి వ్యక్తి తండ్రికి తగ్గ తనయుడు ప్రజల కోసం పాటుపడే వ్యక్తి గ్రానైట్ అనుబంధమైన వ్యక్తి గ్రానైట్ సమస్యలపై పోరాడే వ్యక్తి మంచి గుణం ఉన్న వ్యక్తి అందర్నీ కలుపుకుపోయే వ్యక్తి ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో ఏదులాపురం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా వాళ్ల స్వగ్రామం కలిసి సన్మానం. చేయడం జరిగినది పలు సమస్యలు వల దృష్టికి తీసుకెళ్లడం జరిగిన మీకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని మాటేయటం జరిగినది మున్సిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు వైస్ ప్రెసిడెంట్ పాషా వైస్ ప్రెసిడెంట్ గిరి మరో వైస్ ప్రెసిడెంట్ భద్రం సెక్రటరీ జానీ ట్రెజరర్ టు రామ్మూర్తి జాయింట్ సెక్రెటరీ నరసింహారావు ఈసీ మెంబర్ వడ్లకొండ శీను తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
గురువారం 26 ఫిబ్రవరి 2026

# గ్రామంలో ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలి!

**-ప్రజల మద్దతుతో గ్రామాన్ని జిల్లా కి ఆదర్శంగా నిలబెడతా!**
**-ప్రజలకు పిలుపునిచ్చిన సర్పంచ్ గద్దల నరసింహారావు**

**వైరా రూరల్(సూర్య న్యూస్):-**

పాలడుగు గ్రామం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోంది. గ్రామ సర్పంచ్ గద్దల నరసింహారావు రాజకీయాలకతీతంగా ప్రజాసేవనే లక్ష్యంగా చేసుకొని పాలన సాగిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి పై దృష్టి పెట్టి వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. గ్రామంలో పెండింగ్ లో ఉన్న పారిశుధ్యం పై శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టారు.కోతులు బెడద నుంచి విడుదల చేయడానికి గ్రామానికి రెండు బలమైన ఆరోగ్యకరమైన కొండముచ్చులను ప్రతిరోజు పంచాయతీ సిబ్బంది చేత ఉదయం సాయంత్రం గ్రామంలో తిప్పుతున్నారు. ఇంటింటికి చెత్త సేకరించి కార్యక్రమాన్ని కూడా చేపట్టారు.అదేవిధంగా గ్రామానికి మిషన్ భగీరథ నీరు ఎన్ని ట్యాంకులు వస్తుంది.అసలు ఎన్ని ట్యాంకులు రావాలి.రాకపోతే ఎవరు దీనికి బాధ్యులు అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. గ్రామంలో పంచాయతీ సిబ్బంది ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారు.ఎన్ని గంటలకు వస్తున్నారు. ప్రతిరోజు రిజిస్టర్ పరిశీలిస్తున్నట్టు పలు ప్రధాన అంశాలపై దృష్టి పెట్టినట్లు సమాచారం. గ్రామపంచాయతీకి అనుకూలంగా పనిచేయకపోతే ఎవరినైన సహించేది లేదని సిబ్బందిని



హెచ్చరించినట్టు సమాచారం. ప్రతి ఇంటికి మౌలిక సదుపాయాలు అందించాలననే సంకల్పంతో పాలకవర్గం పనిచేస్తున్నట్టు సర్పంచ్ గద్దల నరసింహారావు స్పష్టం చేశారు.పాలడుగు గ్రామాన్ని జిల్లాకు ఆదర్శంగా నిలబెట్టడమే నా లక్ష్యం అని, రాజకీయాల పక్కన పెట్టి ప్రజల సమస్యలే నా రాజకీయాలని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకుంటూ వెంటనే స్పందిస్తున్న తీరుకు గ్రామ ప్రజల నుంచి విస్తృత ప్రశంసలు వెల్లువెత్తున్నాయి. ఎలాంటి వివక్ష లేకుండా ప్రజలకు సమాన న్యాయం చేస్తున్నారని ప్రజలు అభిప్రా యపడుతున్నారు. రానున్న రోజుల్లో ఇదే పాలన అందించాలని మనసారా కోరుకుంటున్నారు.గత పాలకులు గ్రామంలో వేయించిన సిమెంట్ రోడ్ల పైకి వాహనదారులు ఎక్కలన్నా, దిగాలన్న పెద్ద సమస్యగా మారిందిని ఇదే సమస్య ప్రతి వార్డులో ఉన్నదని వాహనదారులు ఆరోపిస్తున్నారు.దయచేసి ఆ సమస్యపై దృష్టిపెట్టి సిమెంటు రోడ్లకు ప్రారంభంలో మట్టి వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# టీయూడబ్ల్యూజే ఐజేయూ జర్నలిస్టు యూనియన్ హర్షం

**- సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు**

**ఖమ్మం (సూర్య బ్యూరో):**

తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ గా కే శ్రీనివాస్ రెడ్డిని మరో రెండు సంవత్సరాల కాలం పాటు పదవిలో కొనసాగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల టి యు డబ్ల్యూ జె ఐజే యూ జర్నలిస్ట్ యూనియన్ ఖమ్మం జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. మీడియా అకాడమీ చైర్మన్గా శ్రీనివాస్ రెడ్డి సేవలు జర్నలిస్టు సమాజానికి, ప్రభుత్వానికి ఎంతో అవసరమని జిల్లా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, కార్యదర్శి మైస పాపారావు పేర్కొన్నారు. పదవీ కాలం పొడగింపు పట్ల యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జాతీయ కమిటీ సభ్యులు నలజాల వెంకటరావు, జిల్లా యూనియన్ మాజీ అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు మామిడాల భూపాల్, మహేందర్, జిల్లా జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, జిల్లా ఉపాధ్యక్షులు మొయినుద్దీన్, ఖమ్మం సిటీ అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, నంచర్ల జనార్ధనా చారి, ఏగినాటి మాధవరావు, ఏలూరి వేణుగోపాలరావు, శీలం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. పదవి కాలం పొడగింపు పట్ల సీఎం రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జర్నలిస్టు యూనియన్ కృతజ్ఞతలు తెలిపింది.

# పెన్షనర్ల బకాయిలు సత్వరం చెల్లించాలి

**-పెన్షనర్ల మరణాలను నిలువరించండి**
**-ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య**

**ఖమ్మం సూర్య మేజర్ న్యూస్**



గత ఇరవై మూడు నెలలుగా ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిలు సత్వరం చెల్లించటం ద్వారా పెన్షనర్ల మరణాలను నిలువరింపచేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలపై ఎస్జిపిఏటి ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద జరుగుతున్న మూడవరోజు దీక్షా శిబిరాన్ని పరిశపుల్లయ్య ప్రారంభిం చారు.ఖమ్మం జిల్లా లో ప్రారంభమైన పెన్షనర్ల ఉద్యమం రాష్ట్ర వ్యాపితంగా రోజు రోజుకి బలోపేతమౌతున్నదని, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పెన్షనర్ల ఉద్యమానికి మద్దతు ఇస్తున్నాయని పాలకులు గమనిం చాలని ఎస్జిపిఏటి నేత పరిశ పుల్లయ్య కోరారు.రానున్న వార్షిక బడ్జెట్ లో పెన్షనర్ల బకాయిలకోసం ఇరవై వేల కోట్లు కేటాయించాలని, ప్రతి నెలా ఉద్యోగ విరమణ చేస్తున్న పెన్షనర్ల బకాయిల చెల్లింపులకై నెలకు ఐదువందల కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి) కోరుతున్నట్లు జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య తెలిపారు. అదేవిధంగా పెన్షనర్లకు డిఆర్ బకాయిలు ఏక మొత్తంగా చెల్లించాలని, వెల్ నెస్ సెంటర్లలో వైద్య సేవలు మెరుగు పరచాలని, మార్కెట్ కమిటీ పెన్షనర్లకు, గ్రంధాలయ పెన్షనర్లకు ట్రెజరి ద్వారా పెన్షన్లు చెల్లించాలని, మూడున్నర లక్షల పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డైరెక్టరేటు ఏర్పాటు చేయాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ పేరును ఎంప్లాయిస్ పెన్షనర్స్ హెల్త్ స్కీమ్( ఇపిహెచ్



ఎస్)గామార్చి పెన్షనర్ల సంఘాల నుండి ఆరుగురికి ప్రాతినిధ్యం కల్పించాలని ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు .రానున్న కాలంలో పెన్షనర్లు పెద్ద ఎత్తున ఉద్యమి ంచడానికి సంసిద్ధంకావాలని పుల్లయ్య కోరారు .ఎస్జిఎ ి ఏటి రాష్ట్ర కార్యదర్శి మేరిఏసుపాదం,పోలీసు అధి కారులు సంఘం నాయకులు ఆర్ రాధాకృష్ణ మూర్తి, వెంకటనారాయణ, టిపిటిఎప్ జిల్లా ప్రధానకార్యదర్శి వెంగళరావు, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కెకరీం, విశ్రాంత ట్రెజరి అధికారి ఫణిరాజకుమార్ దీక్షాశిబిరాన్ని సందర్శించి పెన్షనర్ల దీక్షలకు సంఘీభావం తెలిపి, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో రాయలరవికుమార్, కనపర్తివె ంకటేశ్వర్లు, పెదమళ్ళసత్యనారాయణ, కొలికొండశరత్ బాబు,ఊడుగు వెంకటేశ్వర్లు, యంరామారావు, రామకోటేశ్వరావు, విద్యాసాగర్, కనకదుర్గ, ఉషారాణి, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు. మెమొరాండమ్ అందజేతపెన్షనర్ల సమస్యల సత్వర పరిష్కారం కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి గారికి చేసిన ప్రాతినిధ్యం ప్రతిని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ పి శ్రీజకు ప్రతినిది బృందం అందించింది.

# ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్ల కూల్చివేత దారుణం

**- బాధితులకు బీజేపీ అండగా ఉంటుంది**
**- బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు**

**ఖమ్మం, సూర్య (మేజర్ న్యూస్):**



పేదల సంక్షేమమే ధ్యేయమని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వ అసలు స్వరూపం ఖమ్మం నగరంలో బయటపడిందని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. ఖమ్మం అంబేద్కర్ భవనంలో తలదాచుకుంటున్న భూదాన్ నిర్వాసితులను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు కలసి పరామర్శించారు. వారి దీనస్థితిని చూసి చలించిపోయిన నాయకులు , బాధితుల బాధలను అడిగి తెలుసుకున్నారు. నిరుపేదలను ఇలా అర్థాంతరంగా గెంటివేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ కష్టకాలంలో భారతీయ జనతా పార్టీ వారికి పూర్తి అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని ఆయన బాధితులకు కొండంత భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడు లేని నిరుపేదలు గత 14 సంవత్సరాలుగా భూదాన్ కాలనీలో నివాసం ఉంటున్న ఇళ్లను, వారికి ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా రాత్రికి రాత్రే అధికారులు నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం దారుణమైన విషయం అన్నారు. కారుణ్యం లేకుండా చేసిన ఈ అమానుష చర్యతో పసిపిల్లలు, వృద్ధులతో సహా వందలాది మంది అభాగ్యులు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.పద్నాలుగేళ్లుగా ఒకే చోట స్థిరపడి, రోజువారీ కూలి చేసుకుంటూ బతుకుతున్న వారిని కనీస మానవత్వం లేకుండా ఎలా గెంటివేస్తారని ఆయన ప్రశ్నించారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాల్సిన ప్రభుత్వమే, ఉన్న ఆ కాస్త గూడును లాక్కోవడం దారుణమన్నారు. ఆక్రమణల పేరుతో ఇళు ్ల కూల్చేముందు వారికి కనీస పునరావాసం కల్పించాలన్న సోయి అధికారులకు లేకపోవడం సిగ్గుచేటన్నారు. నిరాశ్రయులైన కుటుంబాలకు తక్షణమే ఆహారం, మందులు వంటి కనీస సదుపాయాలు కల్పించడంతో పాటు, ఏమాత్రం జాప్యం చేయకుండా అసలైన నిరుపేదలకు పక్కా గృహాలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇళ్ల కేటాయింపుల్లో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా, వాస్తవంగా ఇళ్లు కోల్పోయిన అసలైన పేదలందరికీ వంద శాతం న్యాయం జరిగేలా పారదర్శకంగా వ్యవహరించాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నున్నా రవికుమార్, గుత్తా వెంకటేశ్వర్లు, నాయుడు రాఘవరావు, వీరవల్లి రాజేష్, వీరంరాజు, విజయరాజు, గడిల నరేష్ , వాకదాని రామకృష్ణ , శ్రీకృష్ణ పాల్గొన్నారు.

# 17వ వార్డు అభివృద్ధి పై చర్యలు

**- సమస్యల మూలాలు, పరిష్కార దిశలో ముందడుగు**

**కల్లూరు సూర్య టౌన్ న్యూస్ ఫిబ్రవరి 25 :**



మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు యువ మహిళా కౌన్సిలర్ కనపర్తి శ్యామల రాజ్ కుమార్ వార్డు అభివృద్ధికి చేపట్టిన చర్యలు స్థానిక పాలనలో బాధ్యతాయుత నాయకత్వానికి ఉదా హరణగా నిలుస్తున్నాయి వార్డులో ఉన్న మౌలిక సదుపాయాల లోటుపాట్లను లిఖితపూర్వకంగా చైర్మన్ కు అందించి, ప్రజల వద్దకే పాలన అనే ఆలోచనను కార్యరూపంలో చూపిస్తున్నారు వార్డులో డ్రైనేజీ, త్రాగునీరు, రహదారులు వంటి ప్రాథమిక అవసరాల్లో ఉన్న లోపాలను కేవలం ప్రస్తావన స్థాయిలో కాకుండా, అధికారికంగా మున్సిపాలిటీ దృష్టికి తీసుకెళ్లడం ద్వారా సమస్యలకు పరిష్కారమయ్యేలా చేశారు. 17వ వార్డులోని చిన్న బడి పాఠశాలలో త్రాగునీటి సమస్య పై వచ్చిన ఫిర్యాదుకు కౌన్సిలర్ వెంటనే స్పందించడం విశేషం మున్సిపల్ సిబ్బందికి సమస్యను ప్రత్యక్షంగా వివరించి, వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించడం ద్వారా పరిపాలనా యంత్రాంగాన్ని కదిలించారు ఈ చర్య పై పాఠశాల ప్రధానోపా ధ్యాయులు అభినందనలు తెలియజేయడం ద్వారా, ప్రజాప్రతినిధి--ప్రజల మధ్య విశ్వాస బంధం మరింత బలపడినట్టు కనిపిస్తోందని వార్డు ప్రజలు అభిప్రాయపడయతున్నారు. 17వ వార్డులో జరుగుతున్న ఈ చురుకైన చర్యలు ఇతర వార్డులకు కూడా ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని. ప్రజల సమస్యలే అభివృద్ధి పునాది అన్న భావనను కౌన్సిలర్ కార్యరూపంలో చూపిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అండగా ఉంటుంది

## - మంత్రి తుమ్మలపై విమర్శలు, ఆరోపణలు అర్ధరహితం

## - అధ్యక్షులు డిసిసి ఖమ్మం కార్పొరేషన్ నాగండ్ల దీపక్ చౌదరి







**ఖమ్మం సూర్య మేజర్ న్యూస్:**

ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల భూదాన్ భూముల కబ్జాల తొలగింపు సరైనదేనని, సి సి ఎల్ ఏ ఆదేశాల మేరకే ఆక్రమణల తొలగించారని అధ్యక్షులు డిసిసి ఖమ్మం కార్పొరేషన్ నాగండ్ల దీపక్ చౌదరి పేర్కొన్నారు. ఆక్రమణల తొలగింపులో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిపక్షలు చేస్తున్న ప్రచారంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై కొందరు కావాలని చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేద ప్రజల పక్షాన, అభివృద్ధి పక్షాన ఉంటారని ప్రస్తావించారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరుగు తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే పేర్కొన్నారని, అధికా రులకు ఆదేశాలు కూడా జారీ చేశారని పేర్కొన్నారు. సీసీఎల్ఏ వారు కోర్టు ఉత్తర్వులు ప్రకారం ఖాళీ చేయించారని ఆయన తెలిపారు. నిజ మైన పేదలు ఎవరు ఆందోళన చెందవద్దని, అందరికీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అండగా ఉంటారని నాగండ్ల దీపక్ చౌదరి స్పష్టం చేశారు.

# ఖమ్మం వైరా రోడ్డులో వివో వి 70 సిరీస్ గ్రాండ్ లాంచ్ చేసిన మేయర్ పునుకొల్లు నీరజ




**ఖమ్మం సూర్య మేజర్ న్యూస్:**


ఖమ్మం వైరా రోడ్డులోని హాఫీ మొబైల్ లో వివో సంస్థకు చెందిన నూతన వివో వి 70 ఎలైట్ సిరీస్ మొబైల్ ఫోన్ల గ్రాండ్ లాంచింగ్ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ హాజరై కేక్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో రూపొందించిన మొబైల్ ఫోన్లు యువతకు మరింత ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. నగరంలో నూతన వ్యాపార సంస్థలు ప్రారంభమవడం ఖమ్మం అభివృద్ధికి సూచిక అని తెలిపారు. ఈ కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ బి.జే. క్లెమెంట్, 55వ డివిజన్ కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్, వ్యాపారవేత్తలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డీజీఎం వసంత్ రెడ్డి, ఖమ్మం నల్గొండ మహబూబ్ నగర్ సిటీ మేనేజర్ నవీన్ రెడ్డి, ఖమ్మం ఏ సీఎం శ్రీకాంత్,ఖమ్మం ఆర్ఎం రవితేజ, పాల్గొన్నారు. అతిథులు కొత్త మోడళ్లను ఆవిష్కరించి వినియోగదారులకు పరిచయం చేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు వేగినాటి మధు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఇండ్ల స్థలాలు,డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

## -బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్

**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**

నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇల్లు ప్రభుత్వం ఇవ్వాలని బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ డిమాండ్ చేశారు. బిజెపి నేలకొండపల్లి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గ్రామపంచాయతీ ఆఫీసులో బిజెపి మండల అధ్యక్షుడు సుధాకర్ తో కలిసి నాయకులు అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి డబుల్ బెడ్ రూమ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పేదల పక్షాన బిజెపి రాజీలేని పోరాటం చేస్తుందని అన్నారు. పేదల సమస్యల పరిష్కారం కోసం బిజెపి నాయకత్వం ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు మల్లె బోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, సీనియర్



నాయకులు భువనాసి దుర్గారావు నాయకులు షేక్ షర్ఫుద్దీన్, సయ్యద్ మొహినిద్దీన్, కొండ హర్షవర్ధన్, కందరబోయిన గోపి,గుండె పొంగు క్రాంతి,సురేష్,సత్యనారాయణ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సౌర విద్యుత్ పనులు త్వరగా పూర్తిచేయాలి

## - టిజిఎన్పిడిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ కె. వరుణ్ రెడ్డి ఐఏఎస్




**ఖమ్మం సూర్య టౌన్ న్యూస్**

మండల పరిధిలోని చిరునోముల ముష్టికుంట్ల కలకోట బ్రాహ్మణపల్లి గ్రామాలను బుధవారం టిజి ఎన్పీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ కె వరుణ్ రెడ్డి ఐఏఎస్ సౌర విద్యుత్ పనులను పరిశీలించారు అనంతరం విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతూ సౌర విద్యుత్ వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఆ గ్రామ సర్పంచులకు సౌర విద్యుత్ ప్రయోజనాలను వివరించారు. బోనకల్ మండలంలోని 22 గ్రామాలకు మోడల్ సోలార్ పథకం కింద గృహ వినియోగదారుల కోసం 2 కిలోవాట్ ఆన్ గ్రిడ్ సౌర విద్యుత్ వ్యవస్థలు మరియు వ్యవసాయ మోటర్లకు 7.5 కిలోవాట్ గ్రౌండ్ మౌంటెడ్ సౌర ప్లాంట్ల వ్యవస్థ బలోపేతంపై చర్చించారు. విద్యుత్ అధికారులకు సౌర విద్యుత్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిజి ఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ ఐపిసి వెంకటరమణ, ఖమ్మం జిల్లా సూపర్డెంట్ ఇంజనీర్ ఈ.శ్రీనివాసా చారి, కన్స్ట్రక్షన్ డివిజనల్ ఇంజనీర్స్ బద్రుపవర్ , మధిర డివిజనల్ ఇంజనీర్ బి. శ్రీనివాసరావు, రెడ్కో మేనేజర్ పి.అజయ్, కన్స్ట్రక్షన్ ఎడిఈ కిరణ్ చక్రవర్తి,ఏ డీ ఈ బోనకల్ వైవీ ఆనంద్ కుమార్, ఏఈ టి. మనోహర్ బోనకల్ విద్యుత్ శాఖ సిబ్బంది ఆ గ్రామాల సర్పంచులు విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మృతి చెందిన తోళ్ల నారమ్మ

## -మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన

## -ఎంఆర్పిఎస్,రాష్ట్ర జిల్లా,మండల నాయకులు కార్యకర్తలు

**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**



మండల పరిధిలోని సురుద్దేపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందిన తోళ్ల నారమ్మ. ఆమెకు ఇద్దరు కుమారులు శ్రీనివాస్, సూరి,ఒక కుమార్తె నాగలక్ష్మి. మనవాళ్లు మనవరాళ్ళు ఉన్నారు. మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాప సానుభూతిని తెలియజేశారు. అనంతరం బంధువులు,స్నేహితులు,రక్తసంబంధీకులు మధ్య దైవజనులు భూస్థాపిత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ రాష్ట్ర వంగూరి ఆనందరావు,పగికత్తులు ఈదయ్యా,జిల్లా నాయకులు రాయబారపు గురయ్య,వడ్లమూడి వెంకటేశ్వర్లు,తోళ్ళ సురేష్,మండల అధ్యక్షుడు మాదాసి వెంకన్న, మండల,జిల్లా నాయకులు,గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళను సన్మానించిన నంబూరి రామారావు

**వైరా సూర్య ఆర్సి**



వైరా మున్సిపాలిటీ నూతన చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీమతి డాక్టర్ కాపా చంద్రకళ డాక్టర్ కాపా మురళీకృష్ణను వైరా దాల్మిల్ అసోసియేషన్ సభ్యులు లయన్ నంబూరు రామారావు మురళీకృష్ణ హాస్పిటల్ నందు ఘనంగా సన్మానించారు వీరితో పాటుగా 20 వార్డు కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి 2వార్డ్ కౌన్సిలర్ తిరుపతి శివకుమారి 5 వార్డ్ కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీతను ఘనంగా సన్మానించారు అనంతరం మిఠాయిలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమ ంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వై బుచ్చి రామారావు రీజన్ సెక్రటరీ పెనుగొండ ఉపేంద్రరావు కొల్లా రాంబాబు పులి క్రిష్ణార్జునరావు లగడపాటి ప్రభాకర్ రావు కట్ల సురేష్ తాటి కొండ రాము నూకల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.